మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి

ఆదివారం 27 అక్టోబరు 2024 | పేజీలు 8

# వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో అవినీతి చక్రవర్తి..?



- రైతుల పేరుతో నకిలీ బిల్లులు..?
- నిబంధనలకు విరుద్ధంగా గడిచిన కొన్నేళ్లుగా ఇక్కడే కొలువు
- అక్రమాలకు రాచమార్గం వేసుకున్న అధికారిగా ఆరోపణలు
- మార్కెట్ వైస్ చైర్మన్. డైరెక్టర్లకు ఆదాయం ఖర్చు వివరాలు ఇవ్వకుండా దాటవేత..
- ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం చేసినట్లుగా ఎంబిలు రికార్డులు



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో అవినీతి చక్రవర్తి ఇన్నాళ్లుగా రాజ్యమేలాడు. నిబంధనలకు విరుద్ధంగా గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే తిష్ట వేసిన ఆ అధికారి లెక్కలకు .ఖర్చుకు పొంతన లేకుండా పోయింది.. ఇష్టం వచ్చినట్లుగా లెక్కలు రాయడం నకిలీ బిల్లులతో డబ్బులు లక్షల్లో డ్రా చేశాడని మార్కెట్ యార్డ్ కు దాన్యం విక్రయించేందుకు వచ్చే అమాయకులైన రైతుల కు సౌకర్యాలు కల్పించినట్లుగా చూపించి లక్షల రూపాయలను డ్రా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. గత 8 సంవత్సరాల నుండి ఇక్కడే కొలువు చేస్తున్న ఈయన బినామీ వ్యక్తుల పేర్ల మీద చెక్కులు రాసి పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా చేసినట్లు తెలుస్తుంది . గతంలో మార్కెట్ యార్డ్ కు పాలకవర్గం లేకపోవడంతో అడిగే వారు లేక ఆయన చెప్పిందే లెక్క చేసిందే ఖర్చు అనే విధంగా వనపర్తి మార్కెట్ యార్డ్ పరిస్థితి నెలకొంది. ఇటీవల వనపర్తి మార్కెట్ యార్డ్ కు పాలకవర్గం ఏర్పడింది. వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి తో పాటు ఇతర పాలకవర్గం డైరెక్టర్లు వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో గత మూడు సంవత్సరాల నుండి మార్కెట్ యార్డుకు వచ్చిన ఆదాయం ఖర్చు ఇతరత్రా వివరాలను తమకు చూపాలని కోరుతున్నప్పటికీ ఆయన వారిని లెక్క చేయడం లేదని పాలకవర్గంలోని కొందరు సభ్యులు తెలిపారు. గట్టిగా పట్టుబట్టి తమకు లెక్కలు ఎందుకు చూపడం లేదు అని

మిగతా 2లో

ఫోన్‌లో స్పందించని జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్

వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిధుల ఖర్చు ఆదాయం దగ్గర వాటిపై వస్తున్న ఆరోపణలపై వివరణ కోరెందుకు జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్ కు ఫోన్ చేయగా ఆయన ఫోన్‌లో స్పందించలేదు.



# సతీష్ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటాం

## - కుటుంబ సభ్యులకు సిఎం రేవంత్ రెడ్డి భరోసా



**మద్దూరు మేజర్ న్యూస్ :** కాంగ్రెస్ నాయకుడు సతీష్ కుటుంబానికి అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ సతీష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సతీష్ తల్లిదండ్రులు, భార్యా పిల్లలతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా మద్దూర్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సతీష్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా మద్దూరుకు చేరుకొని సతీష్ స్వగృహంలో నిర్వహించిన దశ దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. సతీష్ కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ భార్య సంగీత తన ఇద్దరు కుమారులు వీరేష్, ఆదిత్య ల ఉన్నత చదువులకు సాయం చేయాలని సీఎం ను కోరగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. జాతీయస్థాయిలో వాలీబాల్ పోటీలలో ప్రతిభ చాటిన సతీష్ తమ్ముడు మణికంఠ తనకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశం ఇప్పించాలని రెజూమ్ ను సీఎం రేవంత్ రెడ్డికి అందజేయగాపరిశీలించాలని కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ని సీఎం ఆదేశించారు. అలాగే సతీష్ సోదరి వీరమణి బిడిఎస్ పూర్తి చేసిన తన కొడుకుకు ఉద్యోగ అవకాశం కల్పించాలని సీఎం కు విన్నవించారు. సతీష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిడి శ్రీహరి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ గరిమానరుల, జోగులాంబ గద్వాల జోన్ -7 డి ఐ జి ఎల్.ఎస్. చౌహాన్ , జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయకుమార్, పిఎసిస్ అధ్యక్షులు గూళ్ళ నర్సింలు, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ బీములు,కొత్తూరు తిరుపతి రెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి, జి రవికుమార్, వీరేష్ గౌడ్ , నిడ్జింత విజయ్, శ్రీనివాస్ రెడ్డి, జి రఘు రామకృష్ణ రెడ్డి,ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలి

## - మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో, మేజర్ న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఏ పథకం వచ్చిన వాటిపై విస్తృత ప్రచారం కల్పించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఐడిఓసి కార్యాలయంలో దిశ సమావేశం జరిగింది. ఎంపి డికె అరుణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వచ్చే ఎలాంటి పథకాలకు శంకుస్థాపన కార్యక్రమంలో చేస్తున్న విధిగా సమాచారం అంధించాలని కోరారు. ఇది తమ ప్రచారం కోసం కాదు అని ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న 65 ఐటిఐ కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఎటిసీలుగా అప్ గ్రేడ్ చేసి హైద్రాబాద్‌లో సియం శంకుస్థాప చేసి ప్రారంభించారు అన్నారు. అప్ గ్రేడ్ అయిన ఐటిఐ కళాశాలను నేను వెళ్ళిచూచిన రోజు కేవలం 9 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి అని మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసిన తర్వాత ఎటిసి సెంటర్ కోసం శంకుస్థాపన చేస్తే వెంటనే 120 దరఖాస్తులు వచ్చాయి అని తెలిపారు. ముద్ర లోన్‌లు ఎందుకు సరిగ్గా ఇవ్వడం లేదు అని ప్రశ్నించారు. ఈ పథకం ఉద్దేశ్యం ప్రక్కదారి పడుతుందని అన్నారు. వీధి వ్యాపారులకు ఎలాంటి ఆధారం లేని వారికి ముద్ర స్కీంను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. మరి బ్యాంకులు ఎందుకు ఈ స్కీంను విస్మరిస్తున్నాయి అని ప్రశ్నించారు. ఎంపి డికె అరుణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతున్న పథకాలు సక్రమంగా అమలు జరగాలని కోరారు. పథకాల్లో లోటుపాట్లు ఉంటే సరిచేసుకోని పరిష్కారం చేసుకోవాలని సూచించారు. పథకాలు ప్రజల్లోకి తీసుకెల్లాలని కోరారు. ఇరిగేషన్, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, అడవి శాఖ, విద్యాశాఖ, సహకార శాఖ, బ్యాంకులు, రేషన్ షాపు తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, అడిషినల్ కలెక్టర్ శివేంద్ర ప్రసాద్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నీటి వనరులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## - జల శక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రటరీ అమిత్ శుక్ల




**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** నీటి వనరుల పునరుద్ధరణ, పరిరక్షణకై అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జల శక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రటరీ అమిత్ శుక్ల అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జలశక్తి అభియాన్ క్యాచ్ ది రెయిన్- 2024 నారిశక్తి సే జలశక్తి అనే ఇతివృత్తంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనశక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రెటరీ అమిత్ శుక్ల మాట్లాడుతూ, నీటి సంరక్షణ మరియు నిర్వహణలో మహిళలు కీలక భూమిక నిర్వహించాలని, నీటి సంరక్షణ, ప్రాముఖ్యత, భూగర్భ జలాలు, నాణ్యమైన నీటి సరఫరా, స్వచ్ఛమైన నీటి వనరుల ప్రాముఖ్యతను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత శాఖలన్ని సమన్వయంతో పని చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో చేపట్టిన వాటర్ బాడీస్ పనులు అన్నింటిని జియో టాకింగ్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, డిఆర్‌డిఓ శాఖలు జిల్లాలో చేపట్టిన పనులపై పిపిటి ప్రజెంటేషన్ నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తో కలిసి ఆయన మొక్కలు నాటారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో జల శక్తి అభియాన్ టెక్నికల్ ఆఫీసర్ మధుసూదన్, డి ఆర్ డి ఓ నర్సింగ్ రావు, జిల్లా ఫారెస్ట్ అధికారి నవీన్ రెడ్డి, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్, జడ్పీ సీఈఓ కాంతమ్మ, డిపిఓ శ్యాంసుందర్, ఇరిగేషన్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
ఆదివారం
27 అక్టోబరు 2024

## అవినీతి చక్రవర్తి..?

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత అధికారిని నిలదీస్తే గత వారం రోజుల నుండి ఆయన వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉద్యోగానికి రావడంలేదని కొందరు డైరెక్టర్లు తెలిపారు. ఈనెల 31వ తేదీన ఆయన పదవీ విరమణ చేయనుండడంతో గత ఏడాది కాలంగా వ్యవసాయ మార్కెట్లో అవినీతి రాజ్యమేలిందని ఇక్కడ ఎవరు అడిగే వారు లేక ఆయన ఇష్టారాజ్యంగా ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేసినట్లు తెలుస్తుంది.. గతంలో చిన్న గుంటపల్లి గ్రామ శివారులో రైతుల కోసం ఫార్మేషన్ రోడ్డు నిర్మించినట్లు గా ఎం బి రికార్డులతో మార్కెట్ యార్డ్ కు సంబంధించిన 31 లక్షల రూపాయలు డ్రా చేసినట్లు డైరెక్టర్లు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలకవర్గం సమావేశంలో ఎప్పుడు కూడా ఈ 31 లక్షల రూపాయల చెల్లింపులకు సంబంధించి ఏలాంటి చర్చ జరగలేదని డైరెక్టర్లు అంటున్నారు. తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారిపై వ్యవసాయ శాఖ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు కొందరు డైరెక్టర్లు తెలిపారు తక్షణమే వ్యవసాయ మార్కెట్లో జరిగిన లావాదేవీలకు సంబంధించి విచారణ జరపాలని కోరుతున్నారు.

## రేవల్లి అంగన్వాడీలో కుళ్లిపోయిన గుడ్లు



**రేవల్లి మేజర్ న్యూస్ :** అంగన్ వాడీ కేంద్రంకు వచ్చే పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు కుళ్లిన కోడిగ్రుడ్లు అందించడంతో బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళననకు గురయ్యారు. ఈ సంఘటన రేవల్లి మండల కేంద్రంలోని అంగనవాడి2 కేంద్రంలోచిన్నపిల్లలకు కోడిగుడ్లను పంపిణీ చేశారు. వాటిని ఇంటికి తీసుక వెళ్లిపగలగొట్టి చూడగా దుర్వాసనతో కుళ్లపోయి ఉండటం గమనించి లబ్ధిదారులు ఆగ్రహ వ్యక్తం చేశారు. ఇలాంటి గుడ్లు తింటే తమ పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ఇకనైనా ఉన్నంత అధికారులు పరిశీలించి నాణ్యమైన కోడిగుడ్లు అందేలా చూడాలని కోరుతున్నారు. అంగన్వాడి కేంద్రం2 కు సంబంధించిన టీచర్ ని వివరణ కోరగా, పై అధికారుల పంపించిన విధంగా మేము తీసుకోవడం జరిగిందని, నాసిరకమైన కుళ్ళిన గుడ్లు పంపిణీ పై నుంచి రావడంతో తమకు ఎటువంటి సంబంధం లేదని, ఒకవేళ కుళ్ళిపోయిన కోడిగుడ్లు ఉంటే సరఫరా చేస్తున్న ఏజెన్సీ పై ఉన్నతాధికారుల ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## రైతాంగ ప్రజా నిరసన సదస్సు సభాస్థలినీ పరిశీలించిన మాజీ మంత్రి



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** అక్టోబర్ 29న జరిగే రైతాంగ ప్రజా నిరసన సదస్సు కోసం పాలకెంద్రం దగ్గర ఉన్న ఖాళీ స్థలాన్ని నాయకులతో కలసి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరిశీలించి సభ విజయవంతం కోసం పలు సూచనలు చేశారు. అన్ని అనుమతులు తీసుకోవాలని వచ్చే రైతులకు సభలో ఏటువంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీటి వసతి, భోజన సదుపాయలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశములో మాజీ మంత్రివర్యులు టి.హరీష్ రావు జిల్లా మాజీ ఎం.ఎల్. ఎ లు,మాజీ ఎం.పిలు పాల్గొంటారని రైతులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పి.రమేష్ గౌడ్, నందిమల్ల. అశోక్, మాణిక్యం, రవి ప్రకాష్ రెడ్డి,నాయకులు ఉంగ్లమ్. తిరుమల్,ప్రేమ్ నాథ్ రెడ్డి, గంధం.పరంజ్యోతి, ధర్మా నాయక్, మహేశ్వర్ రెడ్డి,దేవర్లా. నరసింహ, మద్రికుట. శ్రీను,శాంతాన్న, సూర్య వంశపు.గిరి, జోహెబ్బ్ హుస్సేన్, ముద్దసర్,చిట్యాల.రాము,గౌడ్ నాయక్ ,క్రాంతి, హనుమంతు,బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకోట చైర్ పర్సన్ భర్త పొగాకు విశ్వేశ్వర్ పై చర్యలు తీసుకోవాలి



**అమరచింత, మేజర్ న్యూస్:** కొత్తకోట మున్సిపాలిటీ కార్యాలయంలో విధులను నిర్వర్తిస్తున్న వార్డు ఆఫీసర్ మామిండ్ల జయరాములు పై దాడి చేసిన పురపాలక చైర్పర్సన్ భర్త పొగాకు విశ్వేశ్వర పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం అమరచింత పురపాలక కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. వార్డు ఆఫీసర్లు మునిస్వామి, గోపాల్, లక్ష్మయ్య, బాబు లు మాట్లాడుతూ కొత్తకోట మున్సిపాలిటీలో విధులను నిర్వర్తిస్తున్న వార్డు ఆఫీసర్ జయరాములు పై మేనేజర్ సమక్షంలోనే చైర్పర్సన్ భర్త పొగాకు విశ్వేశ్వర్ అకారణంగా దాడి చేసి కొట్టడం జరిగిందని ఇది సరి అయింది కాదని హెచ్చరించారు. వివాదంలో ఉన్న ఒక ఫైలుపై వార్డు ఆఫీసర్ సంతకం చేయనందుకే పొగాకు విశ్వేశ్వర్ అకారణంగా వార్డు ఆఫీసర్ పై తీవ్ర పదజాలంతో దూషిస్తూ దాడి చేసిన ఘటనలో కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పొగాకు విశ్వేశ్వరపై కఠిన చర్యలు తీసుకొని సమగ్ర విచారణ చేసి కఠినంగా శిక్షించాలని వారు కోరారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## ఆరోగ్యవంతమైన యువతను తయారు చేద్దాం : జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** వనపర్తి జిల్లాలో ఆరోగ్యవంతులైన యువతను తయారు చేసేందుకు రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమ్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం ఉదయం వనపర్తి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన చిన్న పిల్లల హృదయ వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి సందర్శించారు. ఆర్.బి.ఎస్.కే ద్వారా ఎన్.యం.డి.సి. సౌజన్యంతో హృదయ ఫౌండేషన్, హైదరాబాద్ వారు వనపర్తి జిల్లాలో హృదయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. స్టార్ హాస్పిటల్ పిడియాట్రీక్ కార్డియాలజీస్ట్ డా. సుమన్ బ్యాస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 84 మంది చిన్నారులను పరీక్షించగా (11 ) మంది చిన్నారులకు శస్త్ర చికిత్సలు అవసరం కాగా మరో 13 మంది చిన్నారులకు వైద్య సేవలు అవసరమని డాక్టర్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు సైతం ఆరోగ్య శ్రీ కింద హైదారాబాద్ లో ఉచితంగా నిర్వహించడం జరుగుతుంది. జిల్లాలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినందుకు హృదయ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని చిన్నారులను ఆరోగ్యవంతులను చేసేందుకు ఆర్.బి.ఎస్.కే ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో వెళ్లి పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడం అనీమియాతో బాధపడుతున్న వారికి వైద్య చికిత్సలు చేయడం, క్రమం తప్పకుండా టీకాలు వేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.జయచంద్ర మోహన్, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, డా. సాయినాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పి..మహేష్, వైద్య సిబ్బంది తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.

## విద్యా రంగానికి అధిక బడ్జెట్ కేటాయించాలి : డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రామస్వామి



**లింగాల,మేజర్ న్యూస్:** బడుగు బలహీన నిరుపేద విద్యార్థులలో విద్యా నైపుణ్యం, గుణాత్మక విద్యను అందించడానికి విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక బడ్జెట్ కేటాయించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డెమోక్రటిక్ ఫీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో వివిధ పాఠశాలలను సందర్శించి నూతన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమం డిటిఎఫ్ సభ్యత్వాల స్వచ్ఛంద నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల డిటియఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి మల్లికార్జున్ ( పియస్ అంబటిపల్లి), ఉపాధ్యక్షులు కార్తిక్ (యుపియస్ కోమటికుంట), మహిళా ఉపాధ్యక్షులు శారద, ప్రధాన కార్యదర్శి (యుపియస్ చెన్నంపల్లి), కార్యదర్శులు రవి (యుపియస్ ధారారం) ఎజాజ్ (యుపియస్ వల్లభాపూర్) వెంకటేశ్వర్లు (పియస్ మానాజీపేట) జిల్లా కౌన్సిలర్స్ ప్రభాకర్ రావు, శ్రీవాణి( పియస్ జీనుగువల్లి) ఆడిట్ కమిటీ కన్వీనర్.ఎల్ల గౌడు(యుపియస్ కోమటికుంట)సభ్యులు లలిత (పియస్ జీనుగుపల్లి)లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక భౌతిక వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. విద్యారంగానికి ఎక్కువ బడ్జెట్ లు కేటాయించడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై నిరుపేదలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అంది, విద్యా శాతం శాతం పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ఎన్ ఈ పి 20 20 దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే నూతన జాతీయ విద్యా విధానాన్ని డిటిఎఫ్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. ఒకటి నుండి మూడవ తరగతి వరకు పూర్వ ప్రాథమిక విద్యను అంగన్వాడి లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం ప్రైవేట్ విద్యను ప్రోత్సహించడమే అవుతుందని విమర్శించారు. పూర్వ ప్రాథమిక విద్యను అంగన్వాడీలకు కేటాయించవద్దని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డిటి ఎఫ్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు యాదగిరిరావు, మోతిరామ్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల రాజశేఖర్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి

### - ఎస్పీ కార్యాలయానికి తరలిన వివిధ సంఘాల నాయకులు



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** మైనర్ బాలికతో వెట్టి చేయించుకోవడమే కాకుండా బంగారం దొంగతనం నేరం మోపడంతో ఆత్మహత్యాయ త్నానికి ఒడిగట్టిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. బిజ్జారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక వడ్డెర రాజేశ్వరి(16) మృతికి కారణమైన సీడ్ ఆర్గనైజర్ పండ్ల రాజశేఖర్ రెడ్డిని వెంటనే హత్యా నేరం కింద అరెస్టు చేయాలని కోరుతూ ఎస్పీ కార్యాలయానికి పెద్ద ఎత్తున వివిధ సంఘాల నాయకులు పార్టీల నాయకులు విద్యార్థి నాయకులు మేధావులు చేరుకున్నారు. ఎస్పీ లేకపోవడంతో ఇంటెలిజెన్సీ సీఐకి మెమోరాండం సమర్పించారు ఎటువంటి నేరం చేయని బాల కార్మికురాలు వడ్డెర రాజేశ్వరిని బంగారం దొంగతనం కింద నేరం మోపి మల్దకల్ పోలీస్ స్టేషన్కు తరలించడంతో పోలీసులు బెదిరించడం ఆ అవమానాన్ని తట్టుకోలేక పురుగుల మందు తాగి చనిపోయిన విషయం తెలిసిందే ఆ కుటుంబము ఫిర్యాదు చేయకుండగా రూ.13.50 లక్షలు పరిహారము చెల్లించి బాలిక శవానికి వెలగట్టారని పెద్ద ఎత్తున వార్తాపత్రికల్లో వచ్చిన సంగతి తెలిసిందే. బండ్ల రాజశేఖర్ రెడ్డి నింద మోపడం వల్లే అవమానాన్ని భరించలేక పురుగుల మందు తాగి పది రోజులు పోరాడి చనిపోయిందని బాలిక మరణానికి కారణము రాజశేఖర్ రెడ్డి అని దీనికి వత్తాసు పలికిన పోలీసులపై కూడా చట్టపరమైన, న్యాయపరమైన, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసినందున బండ్ల రాజశేఖర్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని.. నిందితుడు పలుకుబడి గల ధనవంతుడు, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అమాయకురాలైన వడ్డెర కుటుంబాన్ని కొనుగోలు చేయటం, మైనర్ బాలికను పనిలో ఉంచుకోవడం దొంగతనం నేరం మోపడం వేధించడం పోలీసులతో బెదిరించడం లాంటి ఆకృత్యమైన పనుల వల్ల అవమానాన్ని భరించలేక చనిపోవడం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. నేరస్తుడు ఎంతటి వాడైనా వెంటనే అరెస్టు చేయాలని జోగులాంబ గద్వాల జిల్లాలో గత వారం రోజులుగా అన్ని సంఘాలు అన్ని పార్టీలు మేధావులు విద్యార్థి సంఘాలు ప్రజాసంఘాలు కార్మిక సంఘాలు గొంతెత్తి నినదిస్తున్నా నేటికీ పోలీసులు స్పందించకపోవడం ఏమిటని, ఇప్పటికైనా వెంటనే జిల్లా ఎస్పీ స్పందించి నేరస్తుల్ని అరెస్టు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ఎంతటి వారైనా వదిలే సమస్య లేదని.. బండ్ల రాజశేఖర్ రెడ్డి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, వివిధ బృందాలు హైదరాబాద్, బెంగళూరు వివిధ ప్రాంతాలలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, కేసు నమోదైందని, నిందితున్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. పోలీసు వ్యవస్థ చట్టపరమైన చర్యల్ని తీసుకుంటుందని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ సందర్భముగా.. ప్రజాసంఘాల నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అనేక పార్టీల సంఘాల విద్యార్థి, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు.

## పెండింగ్ స్కాలర్షిప్‌లు విడుదల చేయండి -ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్



**జడ్చర్ల, మేజర్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జడ్చర్ల మండల ఎంఆర్ఓ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ హాజరై మాట్లాడుతూ, చాలామంది విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్షిప్ ల పై ఆధారపడి చదువుతున్నారని తెలిపారు. స్కాలర్షిప్ విడుదల కానందువలన చాలామంది విద్యార్థులు విద్యకు దూరమైన పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తుందని అన్నారు. స్థానిక ఎమ్మార్వో , కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాలని కోరారు. ఇంటర్మీడియట్ చదివిన తర్వాత విద్యార్థులకు స్కాలర్షిప్ రాకపోవడంతో యజమాన్యం సర్టిఫికెట్ ఇవ్వడానికి తీవ్ర ఇబ్బందికి గురి చేస్తుందాన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలని వారు కోరారు, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రమేష్ మండల కార్యదర్శి అశోక్, గణేష్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరంలో అన్నదానానికి దాతల విరాళం



**అచ్చంపేట మేజర్ న్యూస్ :** అచ్చంపేట మండల పరిధిలో గల శ్రీశైల ఉత్తరముఖ ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర పుణ్యక్షేత్రాన్ని శనివారం హైదరాబాద్ కూకట్పల్లికి చెందిన హెూమియోపతి వైద్యులు స్వాతి శ్రీనివాస్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చే వృద్ధులకు వికలాంగుల కోసం వీల్ చైర్ను దేవస్థానానికి వితరణ చేశారు. గతంలో కంటే ఆలయం చాలా అభివృద్ధి చెందిందని ఆలయానికి వచ్చే భక్తులకు నిత్య అన్నదానం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తన వంతుగా నిత్య అన్నదానానికి 5000 రూపాయలను విరాళంగా ఇచ్చారు విరాళం అందించిన దాతను ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి ఆలయ ఈవో శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ డైరెక్టర్లు పవన్, శేఖర్ రెడ్డి, లక్ష్మయ్య, ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది. తదితరులు ఉన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేయాలి

### - మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేయాలని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైనా సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యతగా త్వరితగతన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు, ఆయన వెంట కౌన్సిలర్ రవీందర్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, జంగయ్య, చంద్రయ్య, వెంకటరెడ్డి, సీరియల్, శ్రీను, రవి, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### - తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత



**బాలానగర్ మేజర్ న్యూస్:** పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ అలాగే ఫీజు రియంబర్స్మెంట్ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు బాలనగర్ మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డికి భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత 5 సంవత్సరాల నుండి ఉన్న 8,300 కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్షిప్స్ పెంచాలని కోరారు. అదేవిధంగా స్కాలర్షిప్స్ విడుదలతో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించాలని డిమాండ్ చేస్తూ బాలానగర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ చారీ, నాయకులు ఆనంద్, పవన్, గణేష్, ఆరిఫ్, రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నాగర్‌కర్నూల్‌లో జరిగే మాలల ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయండి

### - మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుపోతుల అనిల్ కుమార్



**పదర, మేజర్ న్యూస్ :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాల మహానాడు ఆధ్వర్యంలో నేడు నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభకు మాల సోదరులు, సోదరీమణులు, నిరుద్యోగులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుపోతుల అనిల్ కుమార్, ఏ ఎం ఎస్ ఏ రాష్ట్ర నాయకులు మధ్యల రాజు శనివారం నాడు పిలుపునిచ్చారు, వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు సరి అయినది కాదని వర్గీకరణ చట్టం అమలు చేయాలంటే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందినప్పుడే అది సాధ్యం అలా కాకుండా సుప్రీంకోర్టు ఏకపక్ష తీర్పు ఇచ్చిందని వారన్నారు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా మాలల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో బాల్ లింగయ్య, ఈశ్వర్, రవికుమార్, బాలు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 225 మంది చెంచులకు సామాగ్రి వితరణ : సంత్ శ్రీ ఆశారాంజీ ఆశ్రమం సంచాలకులు శరత్



**లింగాల, మేజర్ న్యూస్:** సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కలిసి ఉండాలని అప్పుడే సమాజం పురోభివృద్ధి, మానవ వికాసం సాధ్యమని సంతుశ్రీ ఆశారాంజీ ఆశ్రమం సంచాలకులు శరత్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో సంతు శ్రీ ఆశారాంజి శంషాబాద్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మండల పరిధి లోని వివిధ చెంచు పెంటలకు చెందిన 225 మంది చెంచు గిరిజనులకు వివిధ రకాల సామాగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సంతుశ్రీ ఆశారాంజీ బాపూ గారి ప్రేరణతో దీపావళి శుభ సందర్భంగా నిరుపేద చెంచు గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాలని సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ వివిధ రకాల సామాగ్రిని అంద జేసినట్లు వెల్లడించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రజలను జాగృతి పరుస్తూ ఆశ్రమం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక కార్మిక ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.హిందూ ధర్మమే గొప్ప జీవన విధానమని అన్నారు. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత, సంతృప్తి లభిస్తుందని అన్నారు. నాగరిక జీవనానికి దూరంగా అడవుల్లో జీవిస్తున్న చెంచు గిరిజనులు వ్యసనాలకు బానిస కాకుండా దైవభక్తి,ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని సూచించారు. దైవానుగ్రహం డబ్బుతో రాదని భక్తి భావంతోనే కలుగుతుందని అన్నారు. సమాజంలో రోజు రోజుకు భక్తి భావం, ప్రేమానురాగాలు తగ్గుతున్నాయని అన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పుడు మరువరాదని, ఫిబ్రవరి 14న తల్లిదండ్రుల పూజ దినోత్సవాన్ని జరుపుకోవాలని అన్నారు.భక్తి సన్నగిల్లుతున్నందునే ప్రకృతి సహకరించడం లేదన్నారు. రోజువారి కార్యక్రమాలతో పాటు దైవభక్తి, దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. దైవచింతన అలవరచుకోవడం వల్ల మనిషిలో ఏకాగ్రత వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు భక్తిభావంతో సన్మార్గంలో నడుస్తూ మానవ జీవితానికి సార్ధకత చేసుకునేందుకు ఆధ్యాత్మిక చింతనతో జీవనం సాగించాలని ఉద్బోధించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని,ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ దీపావళి పండుగ రోజున ప్రతి ఇంట్లో వెలుగునిండాలనే ఉద్దేశంతో వితరణ చేసిన ప్రమిదలు, నూనె తో దీపం వెలిగించాలని కోరారు. అల్యూమినియం పాత్రల వాడకం వల్ల రోగాల బారిన పడుతున్నారని అందుకోసం స్టీల్ సామాగ్రిని అందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు స్టీల్ వస్తువులను వాడాలని సూచించారు. చెంచు గిరిజనులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వందమంది సంత్ సేవ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి : బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** స్థానిక ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని బిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం కల్వకుర్తి పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ సన్నాహక సమావేశం కల్వకుర్తి అసెంబ్లీ ఇన్చార్జి ఎట్టి ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అంతటి నాగన్న హాజరై మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ పోటీకి సిద్ధం కావాలని పార్టీ నాయకులకు సూచించారు, గత ప్రభుత్వం చేసిన, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజల్లో ఎండగట్టాలని పేర్కొన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు, బహుజనులకు రాజ్యాధికారం బి.ఎస్.పి పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు, అదేవిధంగా జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్, బహుజన్ సమాజ్ పార్టీ కల్వకుర్తి అసెంబ్లీ అధ్యక్షులు గా దన్నారం బాలు ను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి యోసేపు, సీనియర్ నాయకుడు గడ్డమీది వెంకటయ్య, మండల ఇంచార్జీ అధ్యక్షులు కావలి మహేష్, రమేష్, అనిల్, మహేష్, ప్రవీణ్, డోక్కు రాజు, రేణుకా, పారిజాతం తదితరులు ఉన్నారు.

## స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసిన ఎస్.ఏ, ఎస్జీటీలపై కూడా చర్యలు తీసుకోవాలి

### - డీఈఓ తప్పిదాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి - యూఎస్పిసి




**పాలమూరు మేజర్ న్యూస్ :** జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీలలో దుర్వినిగానికి పాల్పడిన గజిటెడ్ ప్రధానోపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ స్వాగతిస్తుందని ఆ సంఘం ప్రతినిధులు రవికుమార్, వెంకటేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొంతమంది ప్రధానోపాధ్యాయులు న్యాయబద్ధంగా, రూల్స్‌ప్రకారం ఆప్షన్స్ ఇచ్చుకున్నా సస్పెన్షన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డీఈవో బదిలీలకు ముందే ఆప్షన్స్ పై విచారణ చేసి ఉంటే ప్రధానోపాధ్యాయులు సస్పెన్షన్ కు గురయ్యే వారు కాదని, డిఈవో నిర్లక్ష్య వైఖరి వల్లనే సమస్య తలెత్తిందని డీఈఓపైనా విచారణ చేపట్టాలన్నారు. స్పౌస్ పాయింట్లను వినియోగించుకున్న అందరు జిహెచ్ఎంల ఆప్షన్స్‌ను విచారణ చేపట్టాలని, కొంత మంది స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్జిటి టీచర్లు స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగపరచారని వివరించారు. సరైన ఆప్షన్స్ ఇవ్వకుండా తమకు ఇష్టం వచ్చిన ప్రాంతాలకు వెళ్లారని వారి పైనా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో బదిలీల్లో అక్రమాలు జరగకుండా చూడాలని, ముగ్గురు హింది పండిట్లకు పోస్టింగ్ ఇవ్వనందున ఎక్కడ ఇంక్రిమెంట్ పొందాలో తెలియక అనిశ్చిత పరిస్థితి నెలకొందని అన్నారు. పదోన్నతుల్లో సీనియార్టీ లిస్టు సక్రమంగా పేర్లు చేర్చకపోవడం వల్ల ప్రమోషన్లు పొందలేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమోషన్ పొందిన వారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. డిఇఓ నిబంధనలకు విరుద్ధంగా తనకిష్టం వచ్చిన ఖాళీలను చూపడం వల్ల ముందు ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. డిఇఓ నిర్లక్ష్యం వల్లనే సమస్యలు తెల్లెత్తుతున్నాయని,ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని, లేనిచో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ఆదిత్య, ఎస్ వెంకటేశ్వర్లు, మహిమూద్, నవీన్ పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ మనందరి బాధ్యత

### - జల శక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రెటరీ అమిత్ శుక్ల



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** నీరు మన జీవనాధారమని.. నీటి సంరక్షణ మనందరి బాధ్యతని జల శక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రెటరీ అమిత్ శుక్ల అన్నారు. శనివారం కేటిదొడ్డి రైతు వేదికలో ఏర్పాటు చేసిన జలశక్తి అభియాన్ క్యాచ్ ది రెయిన్-2024 నారిశక్తి సే జలశక్తి అనే ఇతివృత్తంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జల శక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రెటరీ అమిత్ శుక్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని వర్షపు నీటిని సంరక్షించుకునేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని అన్నారు. ఈ ప్రాంతంలో వర్షపాతం చాలా తక్కువగా ఉన్నందున నీటి కొరత తలెత్తకుండా ప్రజలు నీటిని రక్షించలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలు ఏమిటో తెలుసుకొని, వాటికి ఉత్తమమైన పరిష్కార మార్గాలను సూచించారు. రాబోయే ఐదు సంవత్సరాలలో నీటిని సంరక్షించడానికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమని అన్నారు. ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచుకోవాలన్నారు. సాగు కోసం రైతు సమూహాలకు బోరుబావుల రీచార్జ్ సౌకర్యం అందించడం ముఖ్యమని వివరించారు. నీటి వృథా నివారించేందుకు సరైన నీటి చానెల్స్ నిర్మించాలన్నారు. ముఖ్యంగా మహిళలు భాగస్వామ్యంపై ఈ కార్యక్రమంలో ముందుండి నీటి ప్రాధాన్యతను అందరికీ తెలియజేయాలని అన్నారు. చెట్లు పెంచడం, వివిధ రకాల పండ్ల తోటలను పెంచాలన్నారు. సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడగలమని అన్నారు. నీటిని వృథా చేయకుండా, అవసరానికి తగిన విధంగా మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా అందరూ నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు.అనంతరం ఎన్ ఆర్ఈజిఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన పండ్ల తోటల పెంపకం ఉద్యానాన్ని సందర్శించారు. ఈ సమావేశంలో జల శక్తి అభియాన్ టెక్నికల్ ఆఫీసర్ మధుసూదన్, డి ఆర్ డి ఓ నర్సింగ్ రావు, అడిషనల్ డి ఆర్ డి ఓ నరసింహ, స్వయం సహాయక సంఘం మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలి : సిడిపిఓ భాగ్యమ్మ



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** చిన్నపిల్లలను అంగన్వాడి కేంద్రం లో చేర్పించాలని సిడిపిఓ భాగ్యమ్మ తెలిపారు. శనివారం పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రం లో చిన్నారులకు పుట్టినరోజు కార్యక్రమాలు నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చిన్న పిల్లలకు నూతన పద్ధతిలో విద్యను అందించడమే కాకుండా ఆటలు, పాటలు నేర్పించడం జరుగుతుందన్నారు, అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నపిల్లలకు మంచి పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అలివేలు, చిన్నపిల్లల తల్లులు, పిల్లలు, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

## ఉమామహేశ్వర దేవస్థానం హుండీ ఆదాయం 9 లక్షల 90 వేల 285 రూపాయలు



**అచ్చంపేట మేజర్ న్యూస్:** అచ్చంపేట మండల పరిధిలోగల శ్రీశైల ఉత్తరముఖ ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర పుణ్యక్షేత్రంలో శనివారం ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నుండి లెక్కింపు చేపట్టారు. 2024 సంవత్సరం 4వ నెల 30వ తేదీ నుండి 26 తేదీ 10 నెల 2024 సంవత్సరం వరకు ఐదు నెలల 26 రోజుల భక్తులు సమర్పించుకున్న హుండీ ఆదాయం 9,90,285 రూపాయలు వచ్చాయని ఆలయ ఈవో శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయంతో పాటు గోల్డ్ కాయిన్ వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బందితోపాటు ఆలయానికి వచ్చిన భక్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులు ఉచిత చేప పిల్లలను సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా మత్స్యకార సహకార సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజ్



**బిజినపల్లి మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలను చెరువుల్లో, కుంటల్లో విడిచి మత్స్య సంపద సృ ష్టి0చేలా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యకార సహకార సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజీ కోరారు. మండల కేంద్రంలో ఫిషరీష్ శాఖ అధికారుల అధ్వర్యంలో శనివారం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేపట్టి మాట్లాడారు. వానలు విస్తారంగా కురువడంతో చెరువులు, కుంటలు నీటితో నిండుకున్నాయని నాణ్యమైన చేప పిల్లలను వదిలితే లక్షల విలువ చేసే చేపల ఉత్పత్తి చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గ ఢ్లనర్వ, ఖానాపూర్, లటుపల్లి, గంగారం, శాయిన్పల్లి, వెల్గొండ తదితర గ్రామాల మత్స్యకార సొసైటీ సభ్యులు చేప పిల్లలను తీసుకెళ్ళారు. కార్య క్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ మస్కూరి బంగారయ్య, మత్స్యశాఖ అధికారులు గంగారం, నరసింహులు, శ్రీకాంత్, సొసైటీల సభ్యులు చేతన్, బోనమోని వెంకటయ్య, జగ్గని కోటయ్య, రామకృష్ణ, సాయిబాబా ఉన్నారు.

## గోవింద నామావళిలో పాల్గొన్న పేట మహిళలు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** తిరుమలలో రెండు రోజుల పాటు జరిగే గోవింద నామావళి కార్యక్రమానికి నారాయణపేట నుంచి స్వామి శివానంద,బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ ఆధ్వర్యంలో 40 మంది మహిళలు తిరుమలకు తరలివెళ్లి శనివారం స్వామి వారి గోవింద నామావళి కార్యక్రమంలో పాల్గొని వేంకటేశ్వర స్వామి నీ స్తుతించారు.తిరుమలలో జాతీయ ఆధ్యాత్మిక సదస్సు సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో రెండు రోజుల పాటు 26,27 తేదీల్లో గోవింద నామావళి నిర్వహిస్తున్నారు.ఈ రెండు రోజులు గోవింద నామావళి లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

# ఎన్నో ఒడిదుడుగులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చాను

### - మీ ఆశీస్సులు నాపై ఎల్లవేళలా ఉండాలి - జన్మదిన వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి

### - హాజరైన ఎమ్మెల్సీ నవీన్ కుమార్, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు





**బాలానగర్ మేజర్‌న్యూస్:** ఎన్నో ఒడిదుడుగులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని మీ ఆశీస్సులు ఎల్లవేళలా నాపై ఉండాలని ప్రభాకర్‌రెడ్డి అన్నారు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్ జన్మదిన వేడుకలు శనివారం బాలనగర్ మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు డాక్టర్ లక్ష్మారెడ్డి, నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్ , తదితర ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఈ స్థాయికి రావడానికి ప్రధాన కారణం మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అని కొనియాడారు. వెన్నుపోటు రాజకీయాలు చేసిన వారు భవిష్యత్తులో బాగుపడినట్లు చరిత్రలో లేదని తెలిపారు. అలా వెన్నుపోటు పొడిచే వర్గం ఇక్కడ లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు రోజురోజుకు పెరిగిపోతుందని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి వెంటే తామంతా, ఆయనను తిరిగి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. తన జన్మదిన వేడుకలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు బాలానగర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి పెద్దయపల్లి చౌరస్తాలో ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నిరంజర్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కొడగల్ యాదయ్య, జడ్చర్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ దొరేపల్లి లక్ష్మీ రవీందర్, రాజాపూర్ మాజీ ఎంపీపీ సుశీల రమేష్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ వెంకటాచారి, లింగు నాయక్, పార్టీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, ఉడిత్యాల మల్లేష్, గణేష్ గౌడ్, జగన్ నాయక్, యాదగిరి గౌడ్, గోపాల్ రెడ్డి, కప్పరి బచ్చిరెడ్డి, సూదిని శివానంద్ రెడ్డి, భూపాల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు హాజరైనారు.

## ఎర్రవల్లి శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ పాఠశాలలో కమ్యూనిటీ హెల్పర్స్ డే




**ఎర్రవల్లి మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం కమ్యూనిటీ హెల్పర్స్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మధులిక గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆకలి గొప్పదా ఆలోచన గొప్పదా "అంటే" ఆకలి అవసరాన్ని చూపిస్తుంది. ఆలోచన బ్రతకడం నేర్పిస్తుంది అని గెలుపు వెనక పరిగెత్తడం మాని ప్రయత్నం వెనక పరిగెత్తు అప్పుడు గెలుపు నీ వెనక పరిగెడుతూ వస్తుంది అంటూ విద్యార్థులకు వినసొంపైన మాటలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చెప్పారు. చిన్నారులు చూడ చక్కని డ్రస్సులతో డాక్టర్స్ , లాయర్స్ , పోలీస్, టీచర్స్, డ్రైవర్స్ మరియు రైతుల వేషధారణతో నిర్వహించే ఈ సమాజ సేవ చేసే అవకాశం కల్పించడం ఇప్పటినుండే విద్యార్థులకు గురువులు మరియు తల్లిదండ్రులు తెలియపరచాలని అని, చిన్నప్పటినుండే జీవితంలో ఎదిగే అవకాశాన్ని సృష్టించుకోగలగాలి అని అన్నారు. ఇలాంటిది ఈ నిజ జీవితంలో ఉదయం వేకువ జాము నుండి రాత్రి జాము వరకు మనం చేయబోయే పనులన్నింటిలో ప్రతి వ్యక్తి అవసరమే ప్రతి పనిముట్టు అవసరమే కాబట్టి ఎవరికి ఇచ్చే గౌరవం వారికి ఇవ్వాలి అని తెలియపరచడమే ఈ ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశం అంటూ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వీర గోవర్ధన్ రెడ్డి , డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న లక్ష్మి మరియు అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

## తెలుగుదేశం పార్టీ నూతన సభ్యత్వ నమోదు ప్రారంభం

### -నాగర్ కర్నూల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి రమేష్ కొప్పుల



**నాగర్కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నూతన సభ్యత్వ కార్యక్రమం ప్రారంబించారు. ఇట్టి కార్యక్రమానికి నాగర్ కర్నూల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి రమేష్ కొప్పుల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింలు చేతుల మీదుగా సభ్యత్వం రెన్యువల్ మరియు కొత్త సభ్యత్వం నమోదు చేసుకొన్నారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తలారా! తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఒక్కరూ రూ.100తో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవాలని 5 లక్షల వరకు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్య సహాయం అందుతుందని తెలిపారు . దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ఘన చరిత్ర తెలుగుదేశం పార్టీదని కావున సభ్యత్వం తీసుకోవాలని కార్యకర్తలను కోరారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని ఇప్పుడు మీ మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ నుంచి వాట్సాప్ ద్వారా లేదా వెబ్ సైట్ లింక్ ద్వారా ఆన్ లైన్లోనే పార్టీ సభ్యత్వము తీసుకోవచ్చు అని పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చు అని జిల్లా తాలూక మండల గ్రామాలలో త్వరలోనే తెలుగుదేశం పార్టీ తరఫున సభ్యత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు పార్టీ నాయకులు కార్యకర్తలు ఎవరి వంతుగా వారు ఈ సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపించాలని కోరారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాలకృష్ణ శివ పార్టీ కార్యకర్తలు మొదలగు వారు పాల్గొన్నారు.

## రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### : అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే. రాజన్న




**అమరచింత, మేజర్ న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం అమరచింత మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే. రాజన్న మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నారని విమర్శించారు. 2 లక్షల రుణమాఫీలో అనేక రకాలుగా కొర్రీలు పెట్టి రైతులకు నష్టమయ్యేటట్లు చేశారని ఆయన ఆరోపించారు. రైతు లేనిదే దేశం లేదు, అందరికీ ఆహారం పండించాలంటే రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. కానీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రైతులకు ఇచ్చిన హామీలను అన్నిటిని నెరవేరుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాగ్దానాలు చేశారు. 300 రోజులు కావస్తున్న ఏ ఒక్కటి అమలు కావడం లేదని ఆయన ఆందోళన చెందారు. రాష్ట్రంలో రైతులకు రైతు భరోసా, పంటల బీమా, రైతు బీమా పథకాలను ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి అమలు చేయాలని రాజన్న డిమాండ్ చేశారు. రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల బారిన పడి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, రైతులు అప్పుల పాలై రోడ్డున పడే అవకాశాలు మెండుగా ఉన్నావని ఆయన ఆందోళన చెందారు. ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని రెండు లక్షల రుణమాఫీలో కొర్రీలను పెట్టకుండా రైతులకు సక్రమంగా అమలు చేసేటట్టు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేస్తూ తహసిల్దార్ రవికుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి. వెంకటయ్య, నాయకులు రాజు, చింతలన్న, మని వర్ధన్, కురుమన్న, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే



**మదనపురం మేజం న్యూస్ :** మండల కేంద్రానికి చెందిన కృష్ణ, లత దంపతుల కుమార్తె చారికకు గుండె ఆపరేషన్ కోసం ఇటీవల దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 4,10,000 రూపాయల %బాూజ% అందజేయడంతో, ఇటీవల నిమ్స్ ఆస్పత్రిలో చిన్నారి చారికకు విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన చిన్నారి తల్లిదండ్రులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జగదీష్, రామకృష్ణ, శేఖర్, మహేష్, కోటేశ్వర్ లు పాల్గొన్నారు.

## కెఎల్ఐ కాలువ వరద నీటితో పంట నష్టం





**రేవల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలో ని రిసార్వాయర్ కాలువలో నీరు వస్తే రైతులందరికి సంతోషం కానీ, మండల కేంద్రం రేవల్లి గ్రామానికి చెందిన రైతుకు మాత్రం తీవ్ర నష్టం.రేవల్లి గ్రామానికి చెందిన వంకేశ్వరం నాగయ్య అనే రైతుకు గ్రామ శివారులో 381 సర్వే లో ఒక ఎకరా పొలం ఉంది. ఈ వర్షకాలం ప్రారంభం లో అందులో వరి పంట వేశారు. అయితే పొలం వెంట కె ఎల్ ఐ సంబంధించిన డి 5 కెనాల్ యొక్క మేజర్ 2 కాలువ ప్రవహిస్తుంది, కాలువకు సుమారు రెండు నెలల క్రితం గండి పడి నీరు మొత్తం వరి పంట లో ప్రవహించి చేను నష్టం జరిగింది.ఇరిగేషన్ అధికారులకు నాగయ్య తెలుపగ ఇప్పటి వరకు కాలువ గండి పుడ్చలేదు, అప్పటి నుండి ఇప్పటి వరకు కాలువలో నీరు వచ్చినప్పుడల్లా నీరు పొలాల్లో పారి ఇసుక మెటలు వేసి ఉన్న భూమి మొత్తం పనికిరాకుండా పోయింది, అని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈవిషయం పై సంబంధిత ఇరిగేషన్ అధికారులకు పిర్యాదు చేయగా వారు స్పందించకపోవడంతో, తాజాగా ప్రజావాణి కార్యక్రమం లో నాగయ్య ఈ విషయం పై అధికారులు స్పందించి కాలువ మరమ్మతు నిర్వహించి, తగు నష్టా పరిహారం అందించి న్యాయం జరిగే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చినట్టు చెప్పాడు.ఇప్పటికైనా అధికారులు న్యాయం చేయాలి అని కొరోతున్నాడు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై నవంబర్ 5నుండి దీక్షలు




**పాలమూరు మేజర్‌న్యూస్:** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పర్మినెం ట్ చేయాలని కోరుతూ నవంబర్ 5 నుండి ఆరవ తేదీ వరకు హైదరాబాద్ ఇందిరా పార్కు దగ్గర 48 గంటల దీక్ష చేపట్టనున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. కురుమూర్తి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సిఐటియూ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవో- 60 ప్రకారం కేటగిరీల వారిగా వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబార్ ,బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలన్నారు. ప్రతినెల జీతాలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ , గ్రాటివిటీ పెన్షన్, పర్మినెంట్ కోసం జరిగే ఉద్యమంలో అందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, నాగయ్య, హనుమంతు, రాములు, శ్రీనివాస్ నాగరాజు, కృష్ణయ్య, వెంకటమ్మ ,యాదమ్మ, జంగయ్య , నాగన్న చంద్రకళ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



**కోస్గి మేజర్ న్యూస్:** రాష్ట్ర స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి గుండుమాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి కి చెందిన దస్తమ్మ ఎంపికైనట్లు పాఠశాల క్రీడా సహాయకురాలు స్వప్న శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 19న మహబూబ్ నగర్ లో జరిగిన క్రీడాకారుల ఎంపికలో దస్తమ్మ పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనపరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు.గుండుమాల్ గ్రామం నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు దస్తమ్మ ఎంపికవడం అభినందనీయమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండు మాల్ గజిటెడ్ ప్రధానో పాధ్యాయుడు శేఖర్ రెడ్డి తెలిపారు. ఈమె ఈనెల 28 నుంచి 30 వరకు గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భముగా క్రీడా సహాయకురాలు స్వప్న, రవీందర్ రెడ్డి , మల్లికార్జున్, కవిత, దస్తయ్య అభినందించారు.

## మున్సిపల్ కార్యాలయంలో అధికారుల విధుల నిర్వహణలో అధికారుల జాప్యం

### - కాళీ కుర్చీలు దర్శనమిస్తున్న.. పట్టించుకోని ప్రజా ప్రతినిధులు








**కొత్తకోట మేజర్ న్యూస్ :** ప్రజా సంక్షేమని దృష్టిలో ఉంచుకొని పార్టీలక తీతంగా పనులుచేసే ప్రభుత్వ అధికారులు.. విధుల నిర్వహణలో జాప్యం చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొత్తకోట పట్టణ బిఆర్ఎస్ నాయకులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయానికి హాజరుకాని ఉద్యోగులు సకాలంలో హాజరు కాకపోవడంతో కాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయానికి టాక్స్ లు చెల్లించని నిర్మాణాలు ఉన్న.. అధికారులు ఆ పర్మిషన్లు లేని అక్రమ నిర్మాణదారులకు కొలతలు తీయించి రెట్టింపు(డబల్) పన్నులను వేయాల్సి ఉన్న తూతూ మంత్రంగా వ్యవహరిస్తూ నిర్లక్ష్య వైఖరితో మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. గృహ అవసరాల పేరిట అనుమతులు పొందుతూ కమర్షియల్ నిర్మాణాలు చేస్తున్న మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని కొత్తకోట ప్రజలు మున్సిపల్ అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కు అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే టీపీఓ.. వారంలో ఒక్కరోజు కూడా విధులకు హాజరుకాకుండా ప్రజలు ఫోన్లు చేస్తున్న స్పందించకుండా నిమ్మకు నీరెత్తి నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం పెరిగేలా చూడాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా ముందుకు వెళ్తున్నారని ప్రజలు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. చాలావరకు మున్సిపల్ పట్టణంలో వెంచర్ నిర్మించని ఖాళీ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపార దుకాణాలు కొనసాగుతున్న పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. కొత్తకోట పట్టణంలోని జాతీయ రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణాలను చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్న ఆ వ్యాపారులు.. ఆ స్థల యజమానులు నయా పైసా మున్సిపల్ కార్యాలయానికి ట్యాక్స్ లు చెల్లించడంకున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని మొండిపడ్డారు. స్థలంలో ఎలాంటి మున్సిపల్ నిర్మాణ అనుమతులు లేకుండా మార్బుల్స్, స్టిల్, వెల్డింగ్, పాత ఇనుప సామాన్, సిమెంట్ ఇటుకల తయారీ, హోటల్ , విగ్రహాల తయారీ తదితర వ్యాపారాలు నిర్వహించేందుకు దర్జాగా షెడ్లను నిర్మాణాలు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ఇదంతా జాతీయ రహదారి 44 జంక్షన్ నుంచి మున్సిపల్ పట్టణంలో కొనసాగుతున్న కన్నెత్తి చూసే నాధుడే లేదన్నట్లుగా చోద్యం చూస్తూ వివరిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఈ డిజిటల్ క్రాప్ సర్వే చేయించాలి ఏ.ఈ.ఓ చందన



**మక్తల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని,కచ్ వార్ గ్రామంలో ఏ.ఈ.ఓ చందన.మొబైల్ యాప్ లో డిజిటల్ క్రాప్ సర్వే చేయడం జరిగింది,ఇందులో భాగంగా నేరుగా పొలానికి వెళ్లి ఆ పొలంలో ఆ సర్వే నంబర్ యొక్క సబ్ డివిజన్ లో ఏ పంట ఉన్నదని యాప్ లో ఫోటో తీసి పంట నమోదు చేయాలి.కానీ అక్కడ పొలంలోకి వెళ్ళాక సర్వే నంబర్ యొక్క సబ్ డివిజన్స్ లలో కొన్ని సబ్ డివిజన్స్ యాప్ లో కన్పించడం లేదు.పొలంలో ఒక సర్వే నంబర్ దగ్గర ఇంకొక రైతు వివరాలు చూయిస్తుంది.అంతే కాకుండా కొన్నిసార్లు పొలంలోకి వెళ్ళాక యాప్ ఓపెన్ కావడం లేదు.నెట్వర్క్ రావటంలేదు అని యాప్ లో చూపించిన రైతు వివరాలను పొలంలో ఉన్న రైతులను అడిగితే ఇది మా సర్వే నంబర్ కాదని చెప్తున్నారు.యాప్ లో ఒక సర్వే నంబర్ చూయిస్తే పాస్ బుక్ లో ఇంకో సర్వే నంబర్ ఉంది. క్షేత్ర స్థాయిలో మహిళా ఏ.ఈ.ఓ లు సెక్యూరిటీ లేకుండా ఒంటరిగా పొలాలకు వెళ్లి డిజిటల్ క్రాప్ సర్వే చేస్తుంటే ఎటువైపు నుంచి ఏ అపాయం వస్తుందో అని భయానికి లోనవుతున్నామన్నారు. కావున ఇతర రాష్ట్రాలలో చేపడుతున్న విధంగా ఈ డిజిటల్ క్రాప్ సర్వే ను ప్రైవేట్ ఏజెన్సీ కి ఇప్పించి సర్వే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఓటరు జాబితా రూపొందించేందుకు పార్టీలు సహకరించాలి - జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** అనర్హులు లేని ఓటరు జాబితానురూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాబితా రూపకల్పన జరగాలని తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో రాజకీయ పార్టీల నాయకులతో స్పెషల్ సమ్మరీ రివిజన్ పై సమీక్షించారు. ఎలక్టోరల్ రోల్ ముసాయిదా ప్రచురణ 29.10.2024 (మంగళవారం, ఎలక్టోరల్ రోల్ చివరి ప్రచురణ 06.01.2025 సోమవారం ఉంటుందని, దీనికి సంబంధించి, 09.11.2024 శనివారం 10.11.2024 ఆదివారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధిలోపు ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఒక శని, ఆదివారాల్లో ఓటరు సులభతర కేంద్రాలను నిర్వహించడం ద్వారా ఎస్ ఎస్ ఆర్–2025 కోసం ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. బి ఎల్ ఓలు సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 10:00 గంటలకు హాజరు కావాలి 01.01.2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులందరి నమోదనిర్ధారించబడుతుందన్నారు డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రచురణ తర్వాత జాబితాలో పేర్లు రాని వాళ్ళు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అలాగే డబుల్ ఓటర్లు ఉంటే ఏదైనా ఒకే పోలింగ్ స్టేషన్ లో ఓటరుగా ఉండేలా వారితో క్లియరెన్స్ తీసుకుని జాబితాలో ఉంచాలని, చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆమె తెలిపారు. వీటితో పాటు అభ్యంతరాలు, సలహాలను స్వీకరించడంజరుగుతుందన్నారు. ఒక పోలింగ్ స్టేషన్ 2 కిలోమీటర్ల పరిధిలోపే ఉండాలని, 1500 ఓటర్లు మించితే అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈవిషయమై కాంగ్రెస్ పార్టీ నగర అధ్యకు డు సలీమ్ తన వార్డులో భివండి కాలనీలో అదనంగా ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో మధుమోహన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సుదర్శన్ రెడ్డి, చిన్న రఘు, రాఘవ చౌదరి, బాల్ రాం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారినిలు పాల్గొన్నారు.

## కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం : దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**మదనాపురం మేజర్ న్యూస్ :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన పాలక మండలి ప్రమాణస్వీకారం కురుమూర్తి దేవస్థానంలో ఘనంగా జరిగింది. నూతనంగా ఎన్నికైన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అనంతరం నిర్వహించిన సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ మన అందరి ఇలవేల్పు శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు మరియు జాతర ఘనంగా నిర్వహించేందుకు మూకుమ్మడిగా అందరం కలిసి పనిచేసి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. నూతన పాలకమండలి మరియు అధికారులు నిరంతరం భక్తులకు అందుబాటులో ఉండి ఏర్పాట్లను, మౌలిక వసతులు పర్యవేక్షించాలని, తాను బ్రహ్మోత్సవాలు ప్రారంభం నుండి ముగిసే వరకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ జాతరలో పర్యటిస్తానని తెలియజేశారు. త్వరలో ఘాట్ రోడ్ నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేయనున్నారని జాతరలో శాశ్వత మంచినీటి పరిష్కారానికి 34 లక్షల రూపాయలు ఇప్పటికే మంజూరు చేయించామని రాబోయే రోజుల్లో కాటేజెస్ సామాన్య ప్రజలు వివాహాలు చేసుకునేందుకు వీలుగా స్వామివారి సన్నిధిలో కళ్యాణమండపం నిర్మాణానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. బ్రహ్మోత్సవాలలో విఐపిల కన్నా సామాన్య భక్తులకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు వివిధ హోదాలో ఉన్న ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నల్లమలలో గొర్రెల కాపరి పై ఎలుగుబంటి దాడి,



**పదర, మేజర్ న్యూస్ :** మండలపరిధిలోని ఉడిమిళ్ల గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలో గొర్రెలను మేపుతుండగా శనివారం ఉదయం గొర్రెల కాపరి పై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది, గ్రామస్తుల కథనం ప్రకారం గొర్రెల కాపరి అంజయ్య గొర్రెలను మేపుతుండగా ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో రక్తసిక్తమైన స్థితిలో ఉండగా గ్రామానికి చెందిన రవీందర్ గ్రామంలోకి తీసుకొచ్చాడని గ్రామస్తులు తెలిపారు, అనంతరం చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి అంబులెన్స్ లో పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు, అనంతరం మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు, అంజయ్య ది నల్గొండ జిల్లా కాసరాజు పల్లి కు చెందిన గ్రామస్తుడని గొర్రెలను మేపేందుకు ఈ అడవి ప్రాంతానికి వచ్చినట్లు ఉడిమిళ్ల గ్రామస్తులు తెలిపారు, గొర్రెల కాపరి పై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో గొర్రెల కాపర్లు భయాందోళన చెందుతున్నారు.

## కల్వకుర్తిలో పట్టపగలే దొంగల బీభత్సం
## వృద్ధురాలి మెడలో మూడు తులాల బంగారం చోరీ



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. ఇద్దరు దొంగలు 60 సంవత్సరాల వృద్ధురాలిపై దాడి చేసి మెడలో ఉన్న మూడు తులాల బంగారు తాడును దొంగలించారు, ఎస్సై తెలిపిన వివరాలు సుభాష్ నగర్ కాలనీలోని నోబెల్ పాఠశాల పక్కన పాడుబడిన ఇంట్లో తిరుపతమ్మ అనే వృద్ధురాలు పండ్ల జ్యూస్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు, ఉదయం 9గంటల సమయంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలని చూసి దొంగలు విద్యుత్ అధికారుల మంటూ మాట కలిపారని తెలిపారు, కొద్దిసేపు మాట్లాడిన దొంగలు ఒక్కసారిగా ముఖంపై దాడి చేసి కత్తితో మెడపై పెట్టి బెదిరించి మూడు తులాల బంగారు తాడును దొంగలించారని ఎస్సై వెల్లడించారు, చెవి కమ్మలు లాక్కునే సమయంలో తిరుపతమ్మ అనే వృద్ధురాలు ఒక్కసారిగా అరవడంతో దొంగలు పరారయ్యారని తెలిపారు, వృద్ధురాలు తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరెడ్డి పేర్కొన్నారు.

## ఫార్మసిస్టులదే భవిష్యత్తు
## -పీయూ ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్




**మహబూబ్ నగర్ పి యు మేజర్ న్యూస్ :** సరోజినీ రాములమ్మ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శనివారం 23వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు అతిథిగా పీ యూ ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ వేడుకలలో వీసీ మాట్లాడుతూ, ఫార్మసిస్టులదే భవిష్యత్తు అని, ఫార్మారంగం దినదినాభివృద్ధి చెందుతుందని, దేశంలో హైదరాబాద్ ఫార్మా రంగంలో కీలకమని, బి ఫారం చేసిన తర్వాత యూనివర్సిటీలో ఎంఫార్మ్,పిహెచ్డి చేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలని, ఫార్మసిస్టులు రోగులకు డాక్టర్స్ కు అనుసంధానంగా ఉండి సమాజ సేవ చేస్తున్నారని అన్నారు. అనంతరం కార్యక్రమం విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో సరోజినీ రాములమ్మ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అధ్యాపకులు, విద్యార్థులు సంఖ్యలో పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో పది గొర్రె పిల్లలు మృతి



**బిజినేపల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని వసురాం తాండ పంచాయతీ పరిధిలోని అలుగు తాండలో శనివారం కుక్కల దాడిలో పది గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధిత దంపతులు నార్యనాయక్, చాందీబు తెలిపిన వివరాల ప్రకారం రోజులాగే గొ ర్రెలను మేతకు తీసుకెళ్ళగా పిల్లలను ఇంటి ముందు జల్ల కింద ఉంచారు. జల్లను పైకి లేపిన కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేసి పదింటిని చంపేశాయి. సాయం త్రం ఇంటికి వచ్చి పరిశీలించగా రూ.80 వేల విలువైన గొర్రె పిల్లలు మృతి చెంది ఉండడంతో బోరున విలపించారు. బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు.

## ఆలయ నిర్మాణం కోసం 50000 విరాళం అందించిన సంకపురం రాముడు



**ఐజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా శాంతినగర్ లో నూతనంగా నిర్మితమవుతున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం కొరకు ఐజ మండల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంకపురం రాముడు 50,000 భారీ విరాళం అందించారు. గతంలో కూడా చాలా ఆలయాలకు మతం ఆధారంగా కాకుండా మానవత్వం ఆధారంగా భారీ విరాళాలు అందజేస్తున్న రాముడికి ఐజ మండల ప్రజలే కాకుండా అల్లపూర్ నియోజక ప్రజలకు మొత్తం కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు అని ఆయన ముఖ్య అనుచరులు అన్నారు. శనివారం సంకపురంలోని ఆయన నివాసంలో నగదును శాంతినగర్ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. గుడి నిర్మాణం అనేది చాలా గొప్ప సంకల్పం అని ఆలయాలు నిర్మించడం వల్ల గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన పెరిగి మనసు ప్రశాంతత సేవా భావం పెరుగుతాయని, అలాగే ప్రజల్లో మంచి జరుగుతుందని సంకపురం రాముడు అన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, ఉమామహేష్ యాదవ్, భాస్కర్ రావు, మధుస్వామి, వీరేష్ గౌడ్, గజేంద్ర, శివ, తరుణ్, అయ్యప్ప స్వామి భక్తులు భక్తాదులు ఉన్నారు.

## బైకు అదుపుతప్పి బోల్తా వ్యక్తి మృతి



**చారకొండ, మేజర్ న్యూస్ :** మండల కేంద్రానికి చెందిన కేశమోని శ్రీనివాస్ గౌడ్ 54 సంవత్సరాలు శనివారం ఉదయం మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన ఒకరికి కట్లు కట్టడానికి వెళ్లి తిరిగి చారకొంకు వస్తుండగా శాంతిగూడెం సమీపంలో ఓ మూలమలుపు వద్ద అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. దీంతో శ్రీనివాసులు కిందపడ్డాడు. బైక్ హ్యాండిల్ కు ఉన్న లివర్ శ్రీనివాస్ గౌడ్ కు గొంతుకు కుడి పక్కన లోపలకి దిగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సిరిసనగండ్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చారకొండకు వస్తున్న సమయంలో కింద పడ్డ శ్రీనివాస్ గౌడ్ ను గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 100కు డయల్ చేశాడు. సంఘటన స్థలానికి హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య చంద్రమ్మ ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుకున్నట్లు ఎస్ఐ శంషుద్దీన్ తెలిపారు.

## గుట్కా సిగరెట్ వల్ల కలిగే అనర్థల పై అవగాహన సదస్సు



**దామరగిద్ద మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ముస్తా పేట్ గ్రామంలో శనివారం పాత గ్రామపంచాయతీ దగ్గర మందు గుట్కా సిగరెట్ ను నిషేధించాలని అవగాహన సదస్సు లో పాల్గొనడం జరిగింది సీహెచ్ ఓ నారాయణ సూపర్వైజర్ కిష్టమ్మ ఏఎన్ఎం సిస్టర్ ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్ మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపిటిసిలు విద్యా కమిటీ మాజీ చైర్మన్ నరసింహులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరేందర్ గ్రామ పెద్దలు యువకులు మహిళలు పాల్గొనడం జరిగింది.

## శక్తి పీఠానికి బియ్యం దానం చేసిన కాకర్ల



**నారాయణపేట టౌన్ మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రంలోని శక్తి పీఠానికి అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు కాకర్ల భీమయ్య బియ్యాన్ని శనివారం దానం చేశారు. శక్తి పీఠం వ్యవస్థాపకులు సంత్ శాంతానంద పురోహిత్ స్వామి చేస్తున్న నిత్య అన్నదాన సేవలను గుర్తించి కాకర్ల భీమయ్య బియ్యాన్ని దానం చేసినట్లు తెలిపారు. అంతేకాక నారాయణపేట ను ధర్మ నగరిగా మార్చేందుకు ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. కాగా శాంతా నంద స్వామి వెంట ప్రతి ఒక్కరు ఉండి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా శక్తిపీఠంలో ప్రతిరోజు శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలను, వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించి నిత్య అన్నదాన కార్యక్రమాలను చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఆయన వెంట ఉండి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని భీమయ్య కోరారు. నారాయణపేట ధర్మ నగరిగా మార్చేందుకు చేస్తున్న కృషికి అందరూ కలిసికట్టుగా రావాలని భీమయ్య పిలుపునిచ్చారు. శక్తిపీఠంలో చేస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమాలకు ట్రస్ట్ సభ్యులు సైతం సహకరిస్తున్నందుకు ఆయన వారిని అభినందించారు. రాబోయే రోజులలో శక్తిపీఠం సేవలు మరింత విస్తృతం కావాలని భీమయ్య కోరారు. అనంతరం స్వామి ఆశీర్వచనాలు పొందారు.

## రేపు కల్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**కోస్గి మేజర్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కులను సోమవారం నాడు పంపిణీ చేయనున్నట్లు మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు శనివారం నాడు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్గి మండలంలోని 13 గ్రామాలకు చెందిన 91మందికి కల్యాణ లక్ష్మీ,షాదిముబారక్ చెక్కులు వచ్చాయని తెలిపారు. ఈ చెక్కులను సోమవారం మండల కార్యాలయ సమావేశ మందిరంలో లబ్ధిదారులకు అందజేయనున్నాట్లు ఆయన తెలిపారు.లబ్ధిదారులు నేరుగా కార్యాలయానికి చేరుకుని కల్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కులను తీసుకోవాలని కోరారు.

## బిజెపి సభ్యత్వానికి ప్రజల్లో విశేష స్పందన
## జిల్లా అధికార ప్రతినిధి నర్సన్ గౌడు



**మరికల్ మేజర్ న్యూస్:** మరికల్ మండలం పూసలపాడు గ్రామంలో ఈరోజు మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధికార ప్రతినిధి నర్సన్ గౌడ్ మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారని గ్రామాల పట్టణాల్లో యువకులు మహిళలు రైతులు బిజెపిలో స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని ఇప్పటికే కార్యకర్తలు తమ బాధ్యతగా అతి తక్కువగా కొద్ది రోజుల్లోనే ఊహించని విధముగా సభ్యత్వాలు రెట్టింపు చేశారు. ఇందుకు కారణం కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా ప్రజలు భావిస్తున్నారని అందువల్లనే సభ్యత్వానికి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వేణుగోపాల్. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే శ్రీరామ్.కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బసిరెడ్డి. బిజెపి మండల ఉపాధ్యక్షుడు పోలేమోని రమేష్. వెంకటేష్. రాజేష్. నిఖిల్. నరేష్. కిషోర్. శేఖర్ రెడ్డి. హనుమంతు. నరహరి. చారి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం రెండవ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి
## - జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాల్ రామ్ పిలుపు



**నారాయణపేట మేజర్ న్యూస్:** సిపిఎం జిల్లా మహాసభలు నవంబర్ 3,4 తేదీలలో మక్తల్ పట్టణ కేంద్రంలో సిపిఎం రెండవ జిల్లా మహాసభలు జరగనున్నాయని మహాసభలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండమీది బాల్ రామ్ జిల్లా నాయకులు మేకల బాలప్ప,గుండెగారి దస్తప్ప తెలిపారు. శనివారం రోజు నారాయణపేట మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో జరిగిన విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడుతున్న సిపిఎం మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని సత్వరమే పనులు ప్రారంభించాలని, నారాయణపేట జిల్లాలో అప్పక్పల్లి– కోటకొండ డబల్ లైన్ రోడ్డును మరియు తిప్రస్పల్లి – మక్తల్ రోడ్డును బాగు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కృష్ణా రైల్వే లైన్ మంజూరు చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ఇంటిస్థలం, రెండు పడక గదుల ఇల్లు, రేషన్ కార్డు అంది ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రైతు రుణమాఫీ వర్తింపచేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఎం నాయకులు జోగు భాస్కర్ ,గోపాల్ రాజు, దానప్ప ,కనకప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు ఇవ్వాలి



**ధన్వాడ మేజర్ న్యూస్ :** ధన్వాడ మండల ప్రత్యేక అధికారి మోగులప్ప కొండాపూర్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ , ధన్వాడ కస్తూరి బాయి స్కూల్ మరియు ఎస్ సి హాస్టల్ లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్కూల్, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి మరియు విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.వారి వెంబడి ఎంపిడిఓ సాయి ప్రకాష్ పాల్గొన్నారు.

## దేవరకద్ర గ్రామంలో ఎల్ఆర్ఎస్ స్థలాల పై పరిశీలన చేస్తున్న మండల అధికారులు



**దేవరకద్ర మేజర్ న్యూస్ :** దేవరకద్ర గ్రామంలో ఎల్ఆర్ ఎస్‌లో భాగంగా ప్లాట్ల ను ఆన్లైన్ నందు నమోదు చేయు విధా నాన్ని. మండల కేం ద్రంలోని శనివారం నాడు మండల అధికారులు. కలిసి. ప్లాట్ల యజమానుల స్థలంలో పరిశీలిస్తున్న ఎంపీడీవో. శ్రీనివాసరావు ఎంపీఓ శ్రీనివాసరెడ్డి ప్రజా ప్రతినిధులు, అధికారు లు, గ్రామపంచాయతీ. సీతా నాయక్ మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## అకారణంగా సస్పెండ్ అయిన 163 మంది ఏఈఓలను బేషరుతుగా విధులోకి తీసుకోవాలన్న జిల్లా టీఎన్జీవో



**ఐజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఏఈవోలు జేఏసి శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఏఈవోలు అందరూ కలిసి కేంద్ర డిజిటల్ క్రాప్ సర్వే గురించి ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయాలను ఖండిస్తూ జిల్లా ఏఈవోలు నిరసన వ్యక్తం చేయడం జరిగింది , ఇట్టి నిరసనలో భాగంగా జిల్లా టీఎన్జీవో సెక్రటరీ అయినటువంటి ఆనంద్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఎఈఓ లా జేఏసీ అధ్యక్షులు లోకరాజు కన్వీనర్ లు మణిప్రకాష్, జెన్నీఫర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయికుమార్, పబ్లిసిటీ సెక్రటరీ అనిల్, ట్రెజరర్ ఖాజా మరియు వివిధ మండలాలు ఎఈఓ లు భాస్కర్, విజయ్, శివ,ఉష శ్రీ, తేజస్విని, మానస తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ నేతృత్వంలో తీసుకున్న సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించాలి



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో బిజెపి లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ అడ్వకేట్ విజయ భాస్కర్ అధ్యక్షతన విశేష్ సంపర్క్ సమావేశంలో భాగంగా విభిన్న రంగాలకు చెందిన మేధావులతో సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విశేష్ సంపర్క్ టీం భాద్యులు అహన్యా రాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో గత పదేళ్ల కాలంలో తీసుకున్న సంక్షేమ కార్యక్రమాలు అనేక సంస్కరణలపై సమాజంలోని భిన్న రంగాలకు చెందిన మేధావులతో పార్టీలకతీతంగా చర్చావేదికలు సమావేశాలు నిర్వహించి సంస్కరణలపై ప్రభుత్వ ఉద్దేశాలు ఆయా వ్యవస్థలలో జరగబోయే మార్పులు విశేష సంపర్క్ ద్వారా అవగాహన తీసుకురావడం వాటితో క్షేత్రస్థాయిలో రాబోయే మార్పులను వివరిస్తూ అదే సమయంలో ప్రభుత్వ పథకాలు పాలసీలలో మేధావుల సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కే శ్రీనివాసులు సదానంద్ గౌడ్ నాగరాజు నాగేశ్వర్ రెడ్డి నాగేంద్ర గౌడ్ శ్యాంసుందర్ రెడ్డి న్యాయవాదులు దారా వెంకటేష్ కే అనంతరాజు గోవింద్ గుప్తా వెంకటేష్ రాజేష్ తదితరులు బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్ మహిళా మోర్చా రాష్ట్ర సహకోశాధికారి శ్రీమతి జ్యోతి జిల్లా నాయకులు ఏ రామన్ గౌడ్ కే మాధవరెడ్డి శ్రీమతి సుమిత్రమ్మ బి కుమారస్వామి బోయల రాము పెద్దిరాజు బచ్చు రాము శ్రీమతి కల్పన వెంకట్రాంరెడ్డి సరోజ కవిత అరవింద్ రాయన్న వెంకటేష్ వెంకటస్వామి రవి తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే జిఎంఆర్‌నీ కలిసిన కోణరాజశేఖర్



**దేవరకద్ర మేజర్ న్యూస్ :** కురుమూర్తి స్వామి ఆలయం నూతన పాలకమండలి చైర్మన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా స్థానిక కురుమూర్తిస్వామి. ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో మర్యాదపూ ర్వకంగా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ మధుసూదన్ రెడ్డి గారిని. నూతన ఆలయ డైరెక్టర్లను.మేదర సంఘం రాష్ట్ర నాయకులు కోనరాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి సలవుతో సత్కరించి సన్మానించారు.

## ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

### - ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన




**నాగర్కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మీనాచారి భవన్ లో భారత జాతీయ మహిళా సమాఖ్య నాగర్ కర్నూల్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కందూరి వెంకటమ్మ, అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లా వ్యాప్తంగా గ్రామ మండల శాఖలు కమిటీలను ఏర్పాటు చేసి జిల్లా మొత్తం విస్తరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మూడవసారి అధికరణకు వచ్చిన ఎన్డీఏ బిజెపి ప్రభుత్వం మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామని గొప్పలు చెప్పేది తప్ప ఆచరణలో అమలు లేదు, బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని అర్ధరాత్రి ఆడపిల్లలు తిరిగినప్పుడే స్వాతంత్రం వచ్చినట్లు అని ఆనాడు గాంధీజీ అన్నారు, నేటి వరకు పట్టపగలు ఆడపిల్లలు తిరగాలంటే మానవ మృగాలు, యాసీడు దాడులు, హత్యలు అత్యాచారాలు గ్యాంగ్ రేప్ లు నిత్యం ఏదో ఒకచోట పసిపిల్లల కాడ నుంచి ముసలి వయసు దాక హత్యలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం మహిళలకు 50% శాతం ఉద్యోగాలలో, రాజకీయాలలో, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 21 22 తేదీలలో భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొంటారని రాష్ట్ర మహాసభలలో దిశా నిర్దేశం చేస్తారని మహిళల హక్కులకై నిత్యం పోరాటాలు చేస్తామనితెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, కే వెంకటమ్మ, ఆర్ ఇంద్రమ్మ, మహిళా సమైక్య జిల్లా ఉపాధ్యక్షురాలు కూన కురవమ్మ, మహిళలు పాల్గొన్నారు.

## శిరోముండనం ఘటనలో ఎస్సైని సస్పెండ్ చేయాలి : రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షులు లక్ష్మణ్



**లింగాల,మేజర్ న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముగ్గురు యువకుల శిరోముండనానికి భాద్యుడైన లింగాల ఎస్సై జగన్మోహన్ ను సస్పెండ్ చేసి యస్సీ,యస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫేసర్ గడ్డం లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం లింగాలలో పౌరహక్కుల సంఘం నాయకులు శిరోముండనం ఘటనకు సంబందించి పూర్తి వివరాలను సేవరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 14 న ముగ్గురు యువకుల శిరోమండనం జరిగిన ఘటనలో ఎస్సై జగన్ మోహన్ చట్టాన్ని తన చేతిలోకి తీసుకొని అత్యుత్సాహంగా ప్రవర్తించినట్లు తమ విచారణలో తెలిసిందని అన్నారు. యువకులను పోలీస్ స్టేషన్ లో ఉంచుకొని 3 రోజుల పాటు చిత్ర హింసలు పెట్టి సభ్య సమాజం తలదించుకొనే విధంగా ఎస్సై రాజ్యాగ విరుద్ధంగా ప్రవర్తించాడని ఆరోపించారు. యువకులు ఒక వేళ తప్పుచేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలే తప్పా వారిని అవమానపరిచ్చేలా గుండు గీయించడము ఏచట్టంలో లేదని ఈ ఘటనలో పోలీస్ ఉన్నతాధికారులు తూతూ మంత్రం చర్యలు తీసుకోవడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు. ఇంతటి ఘోరానికి పాల్పడిన ఎస్సై ని వనపర్తి విఆర్ కు బదిలీ చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ సంఘటనలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు వినీత్ కు ఏదైన జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలో చట్ట ప్రకారం వ్యవహరించకపోతే ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం అయ్యే అవకాశాలు కూడా ఉంటాయని ఆయన అన్నారు మునుముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సంఘటనకు పాల్పడిన ఎస్సై పై చర్యలు తీసుకోకపోతే పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘునాథ్, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు సుభాన్, ప్రధాన కార్యదర్శి జక్కా బాలయ్య, కార్యవర్గ సభ్యులు బాలయ్య పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించాలి : ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**చిన్నచింతకుంట, మేజర్ న్యూస్ :** వరి ధాన్యం కొనుగోలును అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి తెలిపారు మండల పరిధిలోని నెల్లి కొండి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తామని. గ్రేడ్ ఏ ధాన్యానికి క్వింటాలుకు 2320 రూ గ్రేడ్ 2 కు 2300 రూ గా ప్రభుత్వం మద్దతు ధర ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఈ సీజన్ నుండి సన్న రకం వరి ధాన్యం పై రూ 500 బోనస్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రంలో అధికారులు, సిబ్బంది తప్పిదాలు తో రైతులు ఇబ్బందులు పడినా బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు ఎల్లయ్య ఎంపీడీవో సుధాకర్ రెడ్డి ఐకెపి ఏపిఎం విష్ణు చారి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ ఉమా మహేశ్వర రెడ్డి. మాజీ సర్పంచ్ వెంకటేష్, నాయకులు వట్టేం శివకుమార్, కృష్ణ కుమార్ రెడ్డి, మల్లారెడ్డి, పర్దిపూర్ వెంకటేష్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

## బాపు బాటలో సత్య శోధన పాదయాత్ర



**ధన్వాడ మేజర్ న్యూస్ :** ధన్వాడ పట్టణంలో బాపు బాటలో సత్య శోధన పాదయాత్ర విజయవంతంగా ముందుకు సాగింది ఈ యొక్క కార్యక్రమంలో చైతన్య విద్యాలయం, అక్షర టాలెంట్ స్కూల్ భారతియ విద్యానికేతన్ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది వారి విద్యార్థులతో భారీగా కదిలి ధన్వాడ పట్టణం ప్రారంభంలో స్వాగతం పలుకుతూ ర్యాలీగా బయలుదేరి గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని నివాళులర్పించారు అనంతరం జూనియర్ కళాశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో సమావేశం యొక్క కార్యక్రమనికి పాల్గొన్నారు అలాగే డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు యువకులు గంజాయి డ్రగ్స్ మద్యానికి దూరంగా ఉండాలంటూ విద్యార్థులు యువకులు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుం దంటూ, రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలంటూ సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యత కలిగిన పౌరుడిగా ముందుకు పోవాలంటే నేను పాదయాత్రకు శ్రీకారం చుట్టానంటూ తెలిపారు ముఖ్యంగా పాదయాత్ర కార్యక్రమం విజయవంతం అవ్వడానికి శెట్టి రమేష్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, డాక్టర్ బాలస్వామి, ఉదయభాను, రామచంద్రయ్య, శ్రీశైలం, గోవర్ధన్ గౌడ్,ఉమేష్,మరియు కురువ మల్లయ్య మాజీ ఎంపీటీసీ లు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ శ్రీనివాససాసాగర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీబ్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం సుభాషిని , జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి పూర్తి సహకారం అందించారు అలాగే ఈ కార్యక్రమంలో ధన్వాడ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలి

### - పాలమూరు ఎబివిపి జిల్లా కన్వీనర్ సతీష్



**మహబూబ్ నగర్ పియు మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ విడుదల చేయాలని ఎబివిపి పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్ అన్నారు. శనివారం తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ విడుదల చేయని కారణంగా దాదాపు 7,500 కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి శివప్రసాద్, జోనల్ ఇన్చార్జులు శివసాగర్, వరుణ్.. కార్తీక్, అక్షయ,శ్రావణి, జయంత్, సిద్దు,శివరాం, సౌమ్య, నికిత, సాయి, వంశీ, నవీన్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**మక్తల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పంచలింగాల గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో తొమ్మిది సంవత్సరములు ప్రధానోపాధ్యాయులు గా విధులు నిర్వహించి బదిలీపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడ్వాట్ కు వెళ్లిన వి. భీమ్ రెడ్డి గణిత ఉపాధ్యాయులను, ఆరు సంవత్సరములు హిందీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి పదోన్నతి పై ప్రాథమికోన్నత పాఠశాల రుద్రసముద్రం గ్రామానికి వెళ్లిన కుమార్ ప్రహ్లాద్ హిందీ ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుమిత్ర,పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వాతి, మాజీ సర్పంచ్ తిక్కమ్మ వెంకటప్ప, పాఠశాల మాజీ ఎస్ఎంసి చైర్మన్ బాపురం మహాదేవ్, ఉపాధ్యాయులు జైపాల్, రాజు, రమేష్, గ్రామస్తులు ఆనంద్,జయన్న గౌడ్, ఆంజనేయులు గౌడ్, రామలింగం, గంగాధర్ గౌడ్, మల్లేష్, రాజప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## నర్వ మండలంలో పేరటి కోళ్ల పంపిణీ



**నర్వ మేజర్ న్యూస్:** నర్వ మండలం కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం రోజు బ్యాక్ యార్డ్ పోల్ట్రీ నాటు కోళ్లను పంపిణి చెయ్యడం జరిగింది. ఇట్టి నాటు కోళ్ల పంపిణి కార్యక్రమం కు గౌరవ ఎంపీడీవో శ్రీనివాస్ మరియు డిపిఎం రాము నాయక్, మరియు ఏపిఎం చంద్రశేఖర్ చేతుల మీద కోళ్ల పంపిణి చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మరియు ఏపిఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర 100 రూపాయలకు ఒక్క కోడిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరారు. ఇంకా నాటు కోళ్లు అవసరం ఉన్నవాళ్లు మీ మీ గ్రామాలలో ఉన్న వివోఏ లను కలిసి పేర్లు రాయించాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమం లో సిసి అంజప్ప, మహాదేవప్ప, మండల మహిళా సమాఖ్య కార్యవర్గము అరుణమ్మ, లక్ష్మమ్మ, అమృత, ఆపరేటర్ రాము, అందరు వివోఏ లు మారియు నాటు కోళ్ల లబ్దిదారులు, నర్వ లోకల్. గ్రామస్తులు, మరియు ఇతర గ్రామపెద్దలు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయానికి ఎల్ఈడీ లైట్లు వితరణ చేసిన బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి



**నర్వ మేజర్ న్యూస్:** నర్వ మండలం లంకాల గ్రామంలో భూదేవి శ్రీదేవి అమ్మవార్ల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం లో ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్న బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి. ఆంజనేయ స్వామి ఈశ్వర వేంకటేశ్వర ఆలయానికి గుడి కమిటీ కోరిక మేరకు ఎల్ఈడి లైట్లను అందించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి. ఇలాంటి ఎన్నో కార్యక్రమాలలో పాల్గొని, ఎన్నో బహుమతులు అందించిన బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ని ఆ దేవుడు చల్లగా చూడాలని గ్రామస్తులు కోరారు. ఇట్టి కార్యక్రమం లో గుడి కమిటీ చైర్మన్ పోలీస్ రాఘవ రెడ్డి, సద్దలి వెంకటేశ్వర్ రెడ్డి, కటికే శ్రీనోజీ, గుడి పూజారి శివయ్య స్వామి, చాకలి ఓంకార్, బీజేపీ బూత్ అధ్యక్షులు అయ్యప్ప స్వామి, బీజేపీ సీనియర్ నాయకులు చాకలి హన్మంతు, లయపొల్ల వెంకటన్న, గుమ్మి కురుమూర్తి, కోట్ల నరసింహ, గడ్డమీది రాజేష్, విజయ్ రామ్. తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కురుమూర్తి దేవస్థానం డైరెక్టర్‌గా ఎన్నికైన బాదం వెంకటేశ్వర్లును సన్మానించిన కొత్తకోట ఆర్యవైశ్యులు



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుప్రసిద్ధ ఆలయమైన శ్రీ కురుమూర్తి దేవస్థానం పాలక మండలి ప్రమాణస్వీకారం శనివారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు . కొత్తకోట పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు బాదం వెంకటేశ్వర్లు దేవస్థానం పాలకమండలి డైరెక్టర్ గా ఎంపికయ్యారు ఈ సందర్భంగా బాదం వెంకటేశ్వర్లను రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి విశ్వనాథం వెంకటరమణ, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొండా శ్రీను, బచ్చు వెంకటరమణ, గుంత కిరణ్, కందే నరేష్, పల్లె శ్రీధర్, శ్రీనివాసులు సంకిరెడ్డిపల్లి మరియు ఆర్యవైశ్య సంఘం కొత్తకోట సభ్యులు మరియు నరుకుల యాదగిరి మంద కన్నయ్య కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు.

## జిల్లా హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలి

### ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ బృందం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ బృందం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పేషెంట్లకు సరేనా వైద్యం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సిపిఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ బి .నర్సింహ లు మాట్లాడుతూ పేరుకు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఉన్న ఈ ప్రాంత ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని ఎమర్జెన్సీ సమస్యలు తలెత్తినప్పుడు మహబూబ్ నగర్ రెఫర్ చేస్తున్నారు డాక్టర్ సిబ్బంది,పోస్టులు ఖాళీగా ఉన్న భర్తీ చేయడం లేదు. అక్కడ ఉన్న మెడికల్ లో మందుల కొరత ఉంది. అన్ని రకాల రోగాలకు సంబంధించి మందులు అందుబాటులో లేక పేషెంట్లకు బయటికి పోయి మందులు తెచ్చుకోవాలని పరిస్థితి నెలకొందన్నారు గతంలో పనిచేసిన సూపరెండెంట్ ఇచ్చిన సమాచారం మేరకు మందులకు,ఆక్సిజన్ కు లక్షలలో బిల్లులు చూపించారు. కానీ ఆసుపత్రిలో రోగులకు మాత్రం డాక్టర్లు రోగానికి సరైన మందులు లేవని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని పేదలకు సరైన వైద్యం అందించాలన్నారు కనీసం సరిపడ అంబులెన్స్ లు జిల్లా ప్రజలకు ఇవి సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ మండల కార్యదర్శి బి నరసింహ, కార్యదర్శి ప్రశాంత్ పార్టీ టౌన్ కార్యదర్శి కెంచ నారాయణ టి యు స జిల్లా నాయకులు, బాలకృష్ణ, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు సాయి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కమిషన్ మెంబర్ కెవిఎన్ రెడ్డిని సన్మానించిన పాత్రికేయులు



**వంగూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ గా కెవిఎన్ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టి సొంత గ్రామం అయిన కొండారెడ్డి పల్లికి శనివారం రావడం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు కేవీయన్ రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పట్ల అవగాహన ఉన్న కెవిఎన్ రెడ్డిని వ్యవసాయ కమిషన్ మెంబర్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నారాయణ మాజీ అధ్యక్షులు జువ్వ కృష్ణయ్య తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి




**గండీడ్ మేజర్ న్యూస్:** ఫీజు రీయంబర్స్మెంట్,స్కాలర్ షిప్ వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గండీడ్ మండల ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు బైఠాయించి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్ షిప్ సకాలంలో అందక పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్ షిప్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత ఉధృతంగా ఉద్యమం చేసి విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కేశవులు, జి.కృష్ణ, తిరుపతి, వేణు, కేశవులు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ హిందూ ధార్మిక సదస్సులో పాల్గొన్న శివానంద స్వామి



**నారాయణపేట మేజర్ న్యూస్:** పరమ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థాన పవిత్రతకై తిరుచానూరు శిల్పారామంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ హిందూ ధార్మిక సదస్సును స్వామి శ్రీనివాసనంద, త్రిదండి రామానుజ దేవనాథ జీయర్ లతో పాటు నారాయణపేట ప్రాంతానికి చెందిన శివానంద స్వామి జ్యోతి ప్రజ్వలన గావించి సదస్సు ప్రారంభించడం జరిగింది. సదస్సులో భారత దేశంలోని పలు రాష్ట్రాల స్వామీజీలు మాతాజీలు పాల్గొనటం సనాతన ధర్మరక్షణకే తిరుపతి క్షేత్ర పవిత్రత కోసం పట్టణంలో మధ్య మధు మాంస దుకాణాలను తొలగించాలని తిరుమలలోని అన్యమతస్తులను తొలగించాలని సనాతన ధర్మ రక్షణకే ప్రతి హిందువు కంకణం కట్టుకోవాలని తెలియజేశారు.

## ఎంపీ డీకే అరుణమ్మని కలిసిన మరికల్ బిజెపి నాయకులు



**మరికల్ మేజర్ న్యూస్:** మరికల్ మండలం కేంద్రంలో మరికల్ రైల్వే స్టేషన్ మీదగా రాయచూర్ వెళ్తున్నటువంటి విశాఖ ఎక్స్ ప్రెస్, మరికల్ రైల్వే స్టేషన్లో స్టాప్ చేయాలనీ స్టాప్ కు వివిధ పట్టణాలు గల నారాయణపేట, కొండాపూర్, ఆత్మకూరు, సిసిగుంట, నర్వ, ధన్వాడ, వివిధ మండలాల ప్రజలకు ఈ యొక్క స్టాపు కు అందుబాటులో ఉంటుంది కావున విశాఖ ఎక్స్ ప్రెస్ ను మరికల్ రైల్వే స్టేషన్ లో స్టాప్ ని నిలిపి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని ఎంపీ అరుణమ్మకు విన్నవించుకుంటు, వినతిపత్రం అందజేశారు. అదే విదంగా రైచూర్ నుండి బీజాపూర్ వెళ్ళేటటువంటి ప్యాసింజర్ రైలు మహబూబ్ నగర్ వరకు పొడగించగలరని ఈ ప్రాంత ప్రజలు అత్యధికంగా మహారాష్ట్రకు ప్రయాణాలు చేస్తుంటారాని ఈ రైలు కోసం కర్ణాటక రాష్ట్రంలో గల రాయచూరు యాదగిరి జిల్లాలకు వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. ఈ రైలును మహబూబ్ నగర్ వరకు పొడిగించినట్లయితే, దేవరకద్ర, మరికల్, మక్తల్ మీదుగా రాయచూరు నుండి రైలు ప్రయాణం జరిగేటట్టు చూడగలరని, ఈ ప్రాంత ప్రజలకు మహారాష్ట్రకు వెళ్లే సౌకర్యం సులభంత్రం అవుతుందని తెలిపారు. నారాయణపేట జిల్లాకు ముఖ్యకూడలిగా ఉన్నటువంటి, మరికల్ రైల్వే స్టేషన్ కేంద్రంలో టికెట్ రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలనీ ప్రయాణికుల సౌకర్యార్థం నారాయణపేట జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోగలరని ఎంపీ అరుణమ్మకు మహబూబ్ నగర్ లో వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సన్ గౌడ్.తిరుపతి రెడ్డి.భాస్కర్ రెడ్డి.రాజేష్ యాదవ్.వేణు గోపాల్. పోలేమోనీ రమేష్. శ్రీరామ్ .విజయ్.నరేష్.మహేష్. నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

## తుల్జాపూర్ అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వెళ్లిన భక్తులు




**నారాయణ పేట జిల్లా ప్రతి నిధి మేజర్ న్యూస్ :** నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామం నుండి దసరా నవరాత్రి ఉత్సవాల తర్వాత అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ప్రతి ఏడాది భారీ ఎత్తున తరలి వెళ్తారు. అందులో భాగంగా శనివారం మహారాష్ట్రలోని తుల్జా భవాని మాత దర్శనానికి భక్తులు వివిధ వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ ప్రత్యేక పూజలు చేపట్టి అమ్మవారి ఆశీస్సులు పొందుతామని తెలిపారు. తుల్జాపురం తుల్జా భవాని మాత కరుణ కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకోనున్నట్లు భక్తులు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వెళుతున్న భాస్కర్ ఆర్ రాజ్ కుమార్ ఎం రాఘవేంద్ర బి రాము బి దేవదాస్ హెచ్ రాజేందర్ నవీన్ లతోపాటు తదితరులు వెళ్లారు.

## తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వెళ్లిన జిల్లా తెదేపా నాయకులు



**దామరగిద్ద మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కందేన్ పల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి తెదేపా సీనియర్ నాయకులు రాములు యాదవ్ శనివారం హైద్రాబాద్ లోని తెదేపా పార్టీ కార్యలంలో పార్టీ పెద్దలను కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా రాములుయాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో కూడా ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో పార్టీ కోసం కృషి చేస్తూ సభ్యత్వ నమోదు చేస్తామన్నారు కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్ల తెదేపా నాయకులు పాల్గొన్న డం జరిగింది.

## నేటిటియుడబ్ల్యూజే(ఐజేయు) సమావేశాన్ని విజయవంతం చేద్దాం..!!

**నారాయణపేట టౌన్ మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న టియుడబ్ల్యూజే(ఐజేయు) ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా టియుడబ్ల్యూజే(ఐజేయు) కన్వీనర్ నారాయణ రెడ్డి, డిజిటల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘు గణప శనివారం ఓ ప్రకటలో కోరారు. ఈ మహాసభకు రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నా రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎంపి డికె అరుణమ్మ,ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణిక రెడ్డి,వాకిటి శ్రీహరి,టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ,ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ హాజరు కానున్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డ్స్ తదితర అంశాలపై వివరించనున్నారు. జిల్లాలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## హీర్యా గుండె ఆపరేషన్ కు 3.5 లక్షల ఎల్.ఓ.సి.లెటర్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అందజేత



**బిజినపల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గౌరారం తాండకి చెందిన ఇస్లావత్ హీర్య కు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి, హీర్యా గుండె ఆపరేషన్ నిమిత్తం మూడున్నర లక్షల ఎల్ఓసి లెటర్ ను శనివారం నాడు ఆయన స్వగృహంలో అందజేశారు. గిరిజనుడు హీర్య గత మూడు నెలలుగా గుండె సంబంధిత వ్యాధులతో తీవ్రంగా బాధపడుతున్నారని గుర్తించి, నిమ్స్ ఆసుపత్రి లో ఉండే ఆపరేషన్ నిమిత్తం ఎల్. వో.సి. లెటర్ ను అందజేసి ఉన్నత మెరుగైన చికిత్సలు గిరిజనవాసులు పొందాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి గిరిజనుల ప్రజాఆరోగ్యం కాపాడుట, గిరిజనులకు మెరుగైన చికిత్సలకు ఆరోగ్యసాయం చేస్తున్నారని గిరిజన నాయకులు గోవిందు నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్ నాయక్, పాండు నాయక్,గోపాల్ నాయక్ లు ఉన్నారు.

## పత్తి రైతుకు ప్రభుత్వ మద్దతు : ఎమ్మెల్యే



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** పత్తి రైతులకు ప్రభుత్వం మద్దతుగా ఉందని మద్దతు ధరకే కొనుగోలు చేస్తారని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ఉట్కూర్ మండల పరిధిలోని తిప్రాస్ పల్లి గ్రామ శివారులో నారాయణపేట,మక్తల్ రైతుల కోసం పత్తి కొనుగోలు కేంద్రాన్ని మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, నారాయణ పేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.సదాశివ రెడ్డితో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సరిపడ గిట్టుబాటు ధరలతో పత్తిని కొనుగోలు చేయనున్నారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సిసిఐ నిర్వాహకులు ఎమ్మెల్యే శ్రీహరిని, మార్కెట్ చైర్మన్ శివారెడ్డినీ ఘనంగా సన్మానించారు. నిర్వాహక అధికారులు, రైతులు, పార్టీ మండల ముఖ్యనాయలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృక్షాలు నరికినా స్పందించని అధికారులు



**ఐజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణ పరిధిలోని ఎమ్మార్వో ఆఫీస్ వెళ్లే రోడ్డు దగ్గర మాజీ చైర్మన్ నాగన్ గౌడ్ షాప్ పక్కన ఉండే ప్లాట్ల యజమానులు. వృక్షాలు నరికి వేశారు. ఈ ఘటనపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారు. గతంలో కొన్నిచోట్ల .వృక్షాలు నరికితే భారీ జరిమానాలు విధించిన అధికారులు ఇప్పుడు ఎందుకు ఊరికే ఉన్నారో అర్థం కావట్లేదు అంటున్న ఐజ పట్టణ ప్రజలు. కొన్ని రోజుల కిందట ఒక ప్రైవేట్ హాస్పటల్ పబ్లిసిటీ కోసం బోర్డు పెట్టేందుకు వృక్షాలు నరికితే వారికి 50 వేల జరిమానా విధించిన మున్సిపాలిటీ అధికారులు అలాగే ఒక మేక హరితహారం మొక్కలు తింటే దానికి పైనువేసిన అధికారులు ఇప్పుడు ఎందుకు ఊరికే ఉన్నారు, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జూరాలకు వరద ప్రవాహం : 10 క్రస్ట్ గేట్లు ఎత్తివేత



**ధరూర్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతుంది కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుంది ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 76,000 క్యూసెక్కుల నీరు జూరాల ప్రాజెక్టు క్రమంగా పెరుగుతూ వస్తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 10 గేట్లు తెరిచి 41,640 క్యూసెక్కుల నీటిని దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం 36,887 క్యూసెక్కుల నీటిని ,ఆవిరి రూపంలో 72 కుడి కాలువ ద్వారా 180 క్యూసెక్కుల, ఎడమ కాలువ ద్వారా 1140 , ప్యారా లెవెల్ కెనాల్ కు 400, బీమా లిఫ్టు2కు 750, ఆర్డీఎస్ లింక్ కెనాల్ కు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9,657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9,398 టీఎంసీల నీటి నిల్వ ఉంది మొత్తం దిగువకు 81,069 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లల వైద్య నిమిత్తం ఏర్పాటు చేసిన ఎన్.ఆర్.సి. లో నిర్దిష్టమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం ఉదయం వనపర్తి మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని స్యామ్ మ్యామ్ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి వయస్సు కు తగ్గ ఎత్తు, బరువు లేకుండా ఉండటానికి గల కారణాలు తెలుసుకొని చికిత్సతో పాటు అక్కడే పౌష్టికాహారం అందించి ఆరోగ్యం చేకూర్చేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసిన ఎన్ ఆర్ సి. కేంద్రంలో పూర్తిస్థాయి ఫలితాలు సాధించాలని వైద్యులను ఆదేశించారు. జిల్లాలో దాదాపు 200 వరకు స్యామ్, మ్యామ్ పిల్లలు ఉన్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా గుర్తించడం జరిగిందని వారిని ఎన్.ఆర్.సి. కేంద్రానికి రప్పించి వయస్సుకు తగ్గ ఎత్తు బరువు లేకుండా ఉండటానికి గల కారణాలను అవసరమైన రక్త పరీక్షల ద్వారా తెలుసుకొని సరైన వైద్యం తో పాటు అక్కడే పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఇక్కడ ఉన్న వైద్య సిబ్బందితో పాటు ఒక అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్, ఆశా వర్కర్ ను అందుబాటులో ఉంచే విధంగా చూడాలని సూచించారు. అనంతరం కలక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వార్డులు అన్ని తిరుగుతూ రోగులతో మాట్లాడారు. వైద్యం అందుతున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్స నిమిత్తం ఏర్పాటు చేస్తున్న ఆపరేషన్ థియేటర్ గది మరమ్మతు పనులను పరిశీలించారు. మరమ్మతు పనులు పూర్తి అయ్యేలోపు కంటి శస్త్ర చికిత్సకు అవసరమైన యంత్ర సామాగ్రిని తెప్పించాలని, నవంబర్ 4వ తేది వరకు ఆపరేషన్ థియేటర్ పూర్తి కావాలని ఆదేశించారు. ఆసుపత్రిలో దయాలసిస్ వైద్య కేంద్రం పై అంతస్తులో ఉన్నందున రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అందువల్ల రోగులను తరలించడానికి అవసరమైన లిఫ్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం, సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జయచంద్ర మోహన్, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సాయినాథ్ రెడ్డి, డా. పరిమళ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగారావు, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, టి.ఎస్.యం. ఐ.డి.సి. కార్యనిర్వహక ఇంజనీరు జైపాల్ రెడ్డి, డి. ఈ, ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం కొలువుదీరిన నూతన పాలకమండలి

### - హాజరైన ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి





**చిన్నచింతకుంట, మేజర్‌న్యూస్ :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన నూతన పాలకమండలి శనివారం కొలువుదిరింది. స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి తో కలిసి పాలకమండలి సభ్యులందరూ కొండపైగల స్వామివారి ప్రధానాలయంలో దేవస్థాన ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ నూతన పాలక మండల సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిం చారు. అనంతరం ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే తో పాటు నూతన పాలక మండల సభ్యులకు శాలువాతో సత్కరించారు. అక్కడ నూతన పాలక మండలి సభ్యులందరూ కలిసి గౌని గోవర్ధన్ రెడ్డినీ నూతన దేవస్థాన చైర్మన్ గా ఎన్నుకున్నారు .ఆయన దేవస్థాన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కొండ దిగువన జాతర మైదానంలో ఏర్పాటు చేసిన సభలో స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ దేవస్థాన నూతన పాలకమండలి సభ్యులు భక్తుల మనోభావాలను గౌరవిస్తూ పని చేయాలని ఆయన సూచించారు. శ్రీ కురుమూర్తి స్వామి జాతర అంటేనే సామాన్య భక్తుల జాతర ఈ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా పాలకమండలి సభ్యులు పని చేయాలన్నారు .శ్రీ కురుమూర్తి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు ఏర్పాట్లపై పై స్థాయి అధికారులకు తెలుపాలన్నారు. విఐపి భక్తులకు ప్రాధాన్యత ఇవ్వకుండా సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పాలకమండలి సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఆలయ విశిష్టతకు భంగం కలగకుండా నూతన పాలకవర్గం సభ్యులు నడుచుకోవాలన్నారు. జాతరలో పాలకమండలి సభ్యుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భక్తుల నుంచి విమర్శలు వస్తాయన్నారు. ఈసారి టాయిలెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వచ్చే బ్రహ్మోత్సవాలు వరకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా టాయిలెట్లను పూర్తిస్థాయిలో నిర్మిస్తామన్నారు. స్వామివారి సన్నిధిలోనే కళ్యాణాలు జరుపుకునేందుకు కళ్యాణ మండపాని నిర్మించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీ కురుమూర్తి స్వామి కొండపైకి రోడ్డు సౌకర్యం కోసం రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని త్వరలోనే ఘాట్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు రావచ్చన్నారు. ఈ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు నేను పర్యవేక్షిస్తానని జాతర ముగిసే వరకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి, ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, మదనాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, నాయకులు అరవింద్ కుమార్ రెడ్డి ,కథలప్ప వట్టెం శివకుమార్ పర్ది పూర్ వెంకటేష్ మహమూద్ వెంకటేష్ వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ రవీంద్రబాబు



**ధరూర్ మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని పాఠశాలలను సందర్శించిన మండల విద్యాశాఖ అధికారి రవీంద్ర బాబు మండల పరిధిలోని నెట్టెంపాడు, జీరబండ, భీంపురం, చిన్నపాడు, మరియు నాగర్ దొడ్డి పాఠశాలను సందర్శించి ఎస్ఏ 1 పరీక్షలను జరుగుతున్న తీరును పరిశీలించడం జరిగింది. అలాగే మధ్యాహ్న భోజనం యొక్క నాణ్యతను పరిశీలించడం జరిగింది. పాఠశాలలలోని విద్యార్థుల సంఖ్యను మరియు రికార్డులను పరిశీలించడం జరిగింది నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఈ సందర్భంగా వంట ఏజెన్సీ వారికి తెలిపారు. అలాగే భీంపురం పాఠశాలలో రెండో జత ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందజేయడం జరిగింది.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

నాగర్‌కర్నూల్ జిల్లా : నాగర్‌కర్నూల్ టౌన్, బల్మూర్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు, తాడూరు, ఉప్పునుంతల

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
9059897456,
9440126456